




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 187, పేజీలు - 08

శుక్రవారం, డిసెంబర్ 19, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## కేసీఆర్ వల్ల లాభం లేదనే ప్రజల తీర్పు

- కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరు
- ఆయనతో ప్రయోజనం లేదని గజ్వేల్ ప్రజలకు అర్థమైంది
- పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు వచ్చాయన్న ముఖ్యమంత్రి
- కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఒక్క ఎన్నికను కూడా గెలవలేదని విమర్శ
- 2029 ఎన్నికల్లోనూ ఇవే పునరావృతమవుతాయని వ్యాఖ్య



**మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరని, అందుకే ఆయనతో ఎలాంటి ప్రయోజనం లేదని గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు ఇచ్చారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని ఆయన అన్నారు. 12 వేలకు పైగా గ్రామపంచాయతీల్లో 7,500కు పైగా కాంగ్రెస్ విజయం సాధించిందని తెలిపారు.**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రజాపాలనకు రెండేళ్ల సంబరాలు జరుపుకుంటున్న సమయంలో సర్పంచ్ ఎన్నికల ఫలితాలు అద్భుతంగా వచ్చాయని అన్నారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించారని ఇప్పుడు సర్పంచ్ ఎన్నికలలోనూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారని సీఎం స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. అర్బన్ తెలంగాణతో పాటు రూరల్ తెలంగాణలో ప్రజలు మాకు అండగా నిలిచారని ఈ ఫలితాలు మా బాధ్యతను మరింత పెంచాయని భవిష్యత్ లో మరింత భాధ్యతతో పని చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.తెలంగాణలో పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన ఫలితాలు సాధించిందని ఈ ఫలితాలు మా రెండేళ్ల పరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ రెండు కూటమిగా కలిసి పోటీ చేశాయని అయినా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం చూపించారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.

### 12,702 పంచాయతీలకు ఎన్నికలు

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ

2లో..

## రిటైర్మెంట్‌కు ముందు ఈ సిక్సర్లు ఏంటి.?

### - జడ్జిలపై సీజేఐ విసుర్లు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా ప్రస్తుతం న్యాయమూర్తుల్లో ఓ ట్రెండ్ కనిపిస్తోంది. పలు చోట్ల న్యాయమూర్తులు తమ రిటైర్మెంట్ కు ముందు కీలక తీర్పులు ఇస్తున్నారు, లేదా గతంలో ఇచ్చిన తీర్పుల్ని అసాధారణంగా సవరిస్తున్నారు. అలాగే రిటైర్మెంట్ తర్వాత పదవులు కోరుకుంటున్నారు. ఈ ట్రెండ్ పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓ పిటిషన్ పై విచారణ సందర్భంగా ఛీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కింది స్థాయి జడ్జీల తీరును తీవ్రంగా ఆక్షేపించింది. దేశంలో పలు చోట్ల న్యాయమూర్తులు తమ పదవీ విరమణలకు ముందు తీసుకుంటున్న నిర్ణయాలపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం

2లో..

## బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం ప్రారంభమైంది

### కేసీఆర్ ఎప్పుడూ చిల్లర రాజకీయాలు చేయలేదన్న కేటీఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం ప్రారంభమైందని, భవిష్యత్తులో సాధించబోయే అఖండ విజయాలకు యాదాద్రి భువనగిరి జిల్లా గడ్డ పునాది వేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని చెప్పారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ మద్దతుతో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల

2లో..

## సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్' అవార్డు

### - కలెక్టర్ల సదస్సులో స్టాండింగ్ ఓవేషన్



అమరావతి (ప్రశ్న న్యూస్) సీఎం చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు లభించింది. ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ఎకనామిక్ టైమ్స్' ఈ అవార్డును ప్రకటించిన విషయాన్ని కలెక్టర్ల సదస్సులో మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఈ ప్రకటన వెలువడగానే

2లో..

## భూవివాదాల్లో నేతల జోక్యం ఉంటోందన్న పవన్

### - ఎట్టిపరిస్థితుల్లోనూ సహించవద్దన్న చంద్రబాబు



- రెండో రోజు కలెక్టర్ల సదస్సులో భూ వివాదాలపై కీలక చర్చ
- 22ఏ భూముల సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం ఆదేశం
- విశాఖ భూ దందాల్లో రాజకీయ నేతల జోక్యంపై పవన్ కళ్యాణ్ ప్రస్తావన
- భూ కబ్జాలపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలకు చంద్రబాబు సూచన
- భూ రికార్డుల డిజిటలైజేషన్, పాస్ పుస్తకాల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్ణయం

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ప్రజలను తీవ్రంగా వేధిస్తున్న భూ వివాదాల శాశ్వత పరిష్కారంపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. కలెక్టర్ల సదస్సు రెండో రోజున భూ సంబంధిత అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఈ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందిని ఇబ్బందులకు గురిచేస్తున్న 22ఏ భూముల వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని, వచ్చే కలెక్టర్ల సమావేశంలో ఇదే మొదటి అజెండాగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విశాఖపట్నంలోని కొన్ని భూ వివాదాల్లో కొందరు

2లో..

## నాంపల్లి కోర్టుకు మంత్రి సీతక్క

- గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నమోదైన కేసు
- కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చాలని 2021లో ధర్నా
- సీతక్కతో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కూడా హాజరు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నమోదైన కేసు విచారణలో భాగంగా ఆమెతో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కూడా కోర్టు ఎదుట హాజరయ్యారు. 2021లో కరోనా మహమ్మారి తీవ్రంగా ఉన్న సమయంలో, కోవిడ్ చికిత్సను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలని డిమాండ్ చేస్తూ సీతక్క, అప్పటి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. కరోనా రోగులకు ఉచిత అంబులెన్స్ సేవలు అందించాలని, వ్యాధితో మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చేయాలని వారు అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అయితే, లాక్‌డౌన్ నిబంధనలు అమల్లో ఉండగా ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించి, కరోనా వ్యాప్తికి కారణమవుతున్నారని ఆరోపిస్తూ అప్పటి కేసీఆర్ సర్కార్ సీతక్క, బల్మూరి వెంకట్‌పై కేసు నమోదు చేసింది. ఆ కేసుకు సంబంధించిన విచారణలో భాగంగానే గురువారం వారిద్దరూ న్యాయస్థానం ముందు హాజరయ్యారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పెద్ద స్కాం

### - గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన జగన్

- పీపీపీ విధానానికి వ్యతిరేకంగా కోటి సంతకాలు
- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు అందజేసిన వైఎస్ జగన్
- ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్ అని తీవ్ర ఆరోపణ



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను లోక్‌భవన్‌లో కలిశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కాం అని ఆరోపించారు. కోటి సంతకాల సేకరణ ప్రతులతో పాటు ప్రజల నిరసనలకు సంబంధించిన ఆధారాలను

2లో..

## డీఎంకే ఒక దుష్ట శక్తి

### - ఈరోడ్ బహిరంగ సభలో విజయ్ తీవ్ర వ్యాఖ్యలు



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు రాజకీయాల్లో వేడి రాజుకుంది. నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ అధికార డీఎంకే ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎంకే ఒక దుష్ట శక్తి అని, తన తమిళగ వెట్రి కళగం (టీవీకే) స్వచ్ఛమైన శక్తి అని వ్యాఖ్యానించారు. ఈరోడ్ జిల్లాలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. గత సెప్టెంబర్ 27న కరూర్ సభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన తర్వాత, తమిళనాడులో విజయ్ నిర్వహించిన తొలి భారీ బహిరంగ సభ ఇదే. "నేను మళ్లీ చెబుతున్నా డీఎంకే ఒక దుష్ట శక్తి, టీవీకే స్వచ్ఛమైన శక్తి. ఈ పోరాటం ఈ రెండింటి మధ్యే జరుగుతుంది" అని విజయ్ తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

2లో..

## బీజేపీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ కార్యకర్తల యత్నం

### - గాంధీభవన్ వద్ద ఉద్రిక్తత




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను ఈడీ కేసులతో వేధిస్తున్నారని ఆరోపిస్తూ తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాదులో గాంధీ భవన్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం దిశగా కవాతు చేయడానికి ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఏఐసీసీ రాష్ట్ర ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు

2లో..

## ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పురస్కారం

### - 29వ అంతర్జాతీయ గౌరవం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. ఒమన్ పర్యటనలో ఉన్న ఆయనకు ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్ గురువారం ప్రదానం చేశారు. గతంలో క్వీన్ ఎలిజబెత్, నెల్సన్ మండేలా వంటి ప్రపంచ ప్రఖ్యాత నేతలకు మాత్రమే ఈ పురస్కారం దక్కింది. రెండు రోజుల క్రితమే ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న మోదీకి ఇది 29వ అంతర్జాతీయ గౌరవం కావడం విశేషం. అంతకుముందు, ప్రధాని మోదీ,

2లో..

# కేసీఆర్ వల్ల లాభం లేదనే ప్రజల తీర్పు

ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో ప్రజాస్వామిక బద్ధంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించినందుకు ఎన్నికల యంత్రాంగానికి, అధికారులకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించినందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. 'బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను సాధించడంపై శాసనసభ సమావేశాల్లో చర్చించి అన్ని పార్టీల అభిప్రాయం మేరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయానికి వస్తాం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'రాష్ట్రంలో 12,728 పంచాయతీలకు గాను 12,702 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగ్గా ప్రజాస్వామిక బద్ధంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం, ప్రజలు స్వేచ్ఛగా తీర్పును ఇవ్వడం అభినందనీయం అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.

### 87 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌దే పై చేయి

రాష్ట్ర వ్యాప్తంగా 12,702 సర్పంచ్ స్థానాల్లో 7,527 స్థానాల్లో కాంగ్రెస్, 808 స్థానాల్లో కాంగ్రెస్ రెబల్స్ గెలిచారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కూటమిగా కలిసి 4224 స్థానాలు గెలుచుకున్నాయన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో రెబల్స్ తో కలిపి 66 శాతం కాంగ్రెస్ గెలుచుకుంటే బీఆర్ఎస్, బీజేపీ కలిపి 33 శాతం స్థానాలు గెలుచుకున్నాయని సీఎం చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ గెలిచిన అసెంబ్లీ స్థానాలతో పాటు మరో 21 నియోజకవర్గాల్లో ప్రజలు తమవైపు నిలిచారని అన్నారు. 87 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ మెజార్టీ సాధిస్తే బీఆర్ఎస్ 6 నియోజకవర్గాల్లో ముథోల్ నియోజవర్గంలో బీజేపీ అధిక స్థానాలు గెలిచాయని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు తమ రెండేళ్ల పాలనపై తీర్పుగా భావిస్తున్నామని చెప్పుకొచ్చారు. 94 శాసనసభ నియోజకవర్గాల్లో పంచాయతీ ఎన్నికలు జరగ్గా 87 శాసనసభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### తొలి ఏడాదిలోనే 61వేల ఉద్యోగాల భర్తీ

ప్రజల ఆశీర్వాదంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండిండినీ సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్నాం అని సీఎం తెలిపారు. 'రాష్ట్రంలో కొత్తగా రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ చెల్లింపు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ. 500 లకే సిలిండర్, 27 వేల కోట్ల రూపాయల మేరకు సున్నా వడ్డీకే మహిళా సమాఖ్యలకు రుణాలు, 4.5 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 61 వేల ఉద్యోగాల భర్తీ, సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం, వందేళ్లుగా జరగని బీసీ కులగణన చేపట్టడం, పేదలకు మంచి విద్యను అందించాలన్న ప్రయత్నాలు, ఇలా అనేక అంశాల్లో ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళుతోంది'అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

### ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై సీఎం ఆగ్రహం

మహాత్మాగాంధీ ఎన్ఆర్ఈజీఎస్ పథకం పేరు మార్పుపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ తీసుకువచ్చిన మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందన మండిపడ్డారు. నరేగా పేరు మార్చడమే కాకుండా విధానాలు మార్చి పేదలకు ఈ పథకం అందకుండా చేయాలని కక్ష, కుట్ర కేంద్ర ప్రభుత్వంలో స్పష్టంగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. కోర్టు చీవాట్లు పెట్టినా సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై అక్రమ కేసుల పెడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు.

### మూసీలోని కాలుష్యం కంటే వీళ్ల కడుపులోనే విషం ఎక్కువ

ప్రతిపక్షంలో ఉన్నవారికి అధికారం కోల్పోయినా అహంకారం తగ్గలేదంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఇంకొకాయన కడుపు నిండా విషం పెట్టుకుని మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మూసీలోని కాలుష్యం కంటే వీళ్ళ కడుపులోనే ఎక్కువ విషం ఉందని ఇకనైనా ఇప్పటికైనా అహంకారం, అసూయ తగ్గించుకోవాలని ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజాతీర్పును గౌరవించి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు సహకరించాలని బరితెగించి వ్యవహరిస్తామంటే ప్రజలు గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు. 2028లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

### కేసీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్

కృష్ణా జలాలపై గతంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కృష్ణాజలాలపై ప్రతిపక్ష నేతగా లేఖరాయండి. 'కృష్ణా జలాల్లో ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం. గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం'అని సవాల్ విసిరారు. 'ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ హయాంలోనే ద్రోహం చేశారు.

మీరు చేసిన ద్రోహాన్ని ఆధారాలతో నిరూపిస్తాం'అని సీఎం రేవంత్‌రెడ్డి ఛాలెంజ్ విసిరారు. 'ఒకవైపు ఆదాయాన్ని పెంచుకుంటూ దుబారాను తగ్గిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరక్కుండా ప్రజలకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ తాపత్రయం'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులకు సంబంధించి పూర్తి వివరాలతో శాసనసభలో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ప్రెస్మీట్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, ధనసరి అనసూయ సీతక్కతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నేషనల్ హెరాల్డ్ కేసు..

## కేవలం రాజకీయ కక్ష సాధింపు

**- ఎమ్మెల్యే సత్యనారాయణ రావు**

**జయశంకర్ భూపాలపల్లి** నేషనల్ హెరాల్డ్ కేసు.. కేవలం రాజకీయ కక్ష సాధింపు తప్ప మరొకటి కాదని.., సీబీఐ, ఈడి లను ఉపయోగించి కాంగ్రెస్ నాయకులను, ముఖ్యంగా గాంధీ కుటుంబాన్ని వేధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎద్దేవా చేశారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి మంజూరునగర్ లోని బీజేపీ కార్యాలయం ముందు డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అంతకుముందు సింగరేణి ఏరియా ఆసుపత్రి సెంటర్ నుండి బీజేపీ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. కొంతసేపు బీజేపీ ఆఫీస్ ముందు బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ ఫిర్యాదును కోర్టు కొట్టేసిందని, కేసులో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు, ట్రాన్సాక్షన్లు లేవని కోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీలపై కక్ష సాధింపు రాజకీయాలే లక్ష్యంగా ఈడీ కేసు నమోదు చేసిందని, బీజేపీ ప్రభుత్వమే ఈడీ, సీబీఐ వంటి సంస్థలను రాజకీయ ఆయుధాలుగా వాడుతోందని ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ప్రాపర్టీ ట్రాన్స్ఫర్ గానీ, అక్రమ ఆస్తుల గానీ లేవని, కోర్టు ఈడీకి చివాట్లు పెట్టి ఇలాంటి కేసులు పెట్టొద్దని హెచ్చరించిందన్నారు. స్వతంత్ర సంస్థలను పార్టీ ప్రయోజనాల కోసం వాడొద్దని స్పష్టమైన సందేశం ఇచ్చిందని, కాంగ్రెస్ నేతలపై తప్పుడు కేసులతో ప్రజల్లో అపనమ్మకం సృష్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈడీ చర్యల వెనుక బీజేపీ రాజకీయ దురాలోచన బయటపడిందని, ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో 2005లో ఉపాధి హామీ పథకం ప్రారంభం అయిందని, ఇప్పుడు పథకం పేరు మార్చి విక్సిత్ భారత్ ? జీ రామ్ జీగా నామకరణం చేశారన్నారు. మహాత్మా గాంధీ పేరు తొలగించడం ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆలోచనకు నిదర్శనమని, పథకాన్ని బలపర్చకుండా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పేదలు, దళితులు, మైనారిటీల సంక్షేమాన్ని పట్టించుకోని వైఖరి కేంద్రానిదని మండిపడ్డారు. కాంగ్రెస్ తీసుకొచ్చిన పథకాల మూలసూత్రాలను బీజేపీ చెరిపేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆరోపణలు గుప్పించారు.

# నితీష్ కుమార్ చేసిన అవమానానికి మహిళా డాక్టర్ రాజీనామా

పాట్నా: ఒక ప్రభుత్వ కార్యక్రమంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తన హిజాబ్‌ను లాగేయడంతో తీవ్ర అవమానానికి గురైన ఒక మహిళా డాక్టర్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ నెల 20వ తేదీన ఉద్యోగంలో చేరడానికి నియామక పత్రం అందుకున్నప్పటికీ, ఆ మహిళ విధుల్లో చేరడం లేదని ఆమె సోదరుడు మీడియాకు తెలిపారు. ఎదురైన అవమాన భారం కారణంగానే తాను ఉద్యోగంలో చేరడం లేదని ఆమె చెబుతున్నారని ఆయన అన్నారు. ఆమెను ఓదార్చి, ఉద్యోగంలో చేరేలా ఒప్పించే ప్రయత్నం చేస్తున్నామని కూడా ఆయన చెప్పారు. ఈ ఘటన డిసెంబర్ 15న పాట్నాలో ఆయుష్ వైద్యులకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమంలో జరిగింది. దీనికి సంబంధించిన వీడియో ఫుటేజ్ కూడా విడుదల అయింది. ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి నివాసంలో జరిగింది.

హిజాబ్ ధరించి ఆ మహిళ ఆర్డర్ తీసుకోవ డానికి వచ్చినప్పుడు, నితీష్ మొదట ఆమెను హిజాబ్ తీయమని సైగ చేశారు. ఆ మహిళ స్పందించకముందే, నితీష్ స్వయంగా ఆమె హిజాబ్‌ను లాగేయడం కూడా వీడియోలో కనిపిస్తుంది. నితీష్ చర్యపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. ఆర్జేడీ ఈ వీడియోను షేర్ చేస్తూ, ముఖ్యమంత్రి మానసిక స్థితి పూర్తిగా దెబ్బతిందా లేక ఆయన నూటికి నూరు శాతం సంఘ్ పరివార్ వ్యక్తా అని ప్రశ్నించింది. ఈ ఘటన మహిళల పట్ల జేడీయూ, బీజేపీల వైఖరిని నిరూపిస్తుందని ఆర్జేడీ అధికార ప్రతినిధి ఇజాజ్ అహ్మద్ అన్నారు. ఈ ఘటన ఖండించదగినదని, నితీష్ కుమార్ రాజీనామా చేయాలని శివసేన, కాంగ్రెస్ పార్టీలు స్పందించాయి.

# రూ. 2.20 లక్షలు దాటిన వెండి



ఒక్కరోజు గ్యాప్ తర్వాత వెండి ధరలు మరోసారి రికార్డు గరిష్టాలకు చేరాయి. అంతర్జాతీయ పరిణామాలు బలంగా ఉండటం, సరఫరా ఆందోళనలు కొనసాగడం, వచ్చే ఏడాది అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాల మధ్య ధరలు అమాంతం ఊపందుకున్నాయి. ముఖ్యంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు సంబంధించి ఇన్వెస్టర్లు గురువారం విడుదలయ్యే నవంబర్ నెల డేటా కోసం, శుక్రవారం వెలువడే వ్యక్తిగత వినియోగ వ్యయం డేటా కోసం ఎదురుచూస్తున్న క్రమంలో విలువ లోహాలపై దృష్టి సారించారు. ప్రపంచ వాణిజ్యంలో బంగారం కంటే వెండికి గిరాకీ ఎక్కువగా కనిపిస్తోందని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. దేశీయంగా కూడా గిరాకీతో పాటు పారిశ్రామిక వినియోగం పెరగడం వంటి పరిణామాల వల్ల కొత్త గరిష్టాలకు చేరుతోంది. బుధవారం వెండి కిలో ఏకంగా రూ.11,000 పెరిగి రూ. 2.22 లక్షల మార్కుకు చేరాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు వెండి ధరలు రూ. 87,578 నుంచి రూ.1,18,533 లేదా 135.34 శాతం పెరిగాయి. మరోవైపు, గోల్డ్ ఫ్యూచర్స్ సానుకూలంగా ప్రారంభమైనప్పటికీ, ఆ తర్వాత తగ్గుముఖం పట్టాయి. బుధవారం బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. బులియన్ మార్కెట్లో స్వచ్ఛమైన పది గ్రాముల బంగారం రూ. 650 పెరిగి రూ. 1,34.510 వద్ద ఉన్నాయి. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల పసిడి 10 గ్రాములు రూ. 600 పుంజుకుని రూ. 1,23,300కి చేరాయి. అంతర్జాతీయ మార్కెట్లలలోనూ ఫిబ్రవరి డెలివరీకి సంబంధించిన కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్లు 13.1 డాలర్లు పెరిగి, ఔన్స్‌కు 4,345.1 డాలర్లకు చేరుకున్నాయి.

# ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పురస్కారం

ఒమన్ సుల్తాన్ హైథమ్ మధ్య మస్కట్‌లోని అల్ బరకా ప్యాలెస్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం కుదరడాన్ని ఇరువురు నేతలు ఒక కీలక మైలురాయిగా అభివర్ణించారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. భారత్, ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతుందని నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 'మైత్రీ పర్వ్' కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే, ఇండియా-ఒమన్ బిజినెస్ ఫోరమ్‌లో పాల్గొని, ఒమన్ వ్యాపారవేత్తలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పెద్ద స్కాం

గవర్నర్‌కు సమర్పించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా చేసి, ఆ కేంద్రంలో మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటల్స్ ఏర్పాటు చేశామని జగన్ తెలిపారు. ఇవి పేదలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ సేవలు అందించేలా రూపొందించామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ కాలేజీలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడం ద్వారా పేదల నుంచి డబ్బులు వసూలు చేసే అవకాశం కల్పిస్తోందని ఆరోపించారు. చంద్రబాబు అన్యాయాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే జరిగే నష్టాల్ని గవర్నర్‌కు వివరించామన్నారు. ప్రజల నిరసనలు సహా ఆధారాలతో గవర్నర్‌కు అందించాం. ప్రభుత్వం బాధ్యతగా ఉండకపోతే ప్రజలు జీవించలేరు. ప్రభుత్వ ఆధీనంలోనే వైద్య, విద్యను అందించాలి. వ్యవస్థల్ని ప్రైవేట్ పరం చేస్తే ఇక ప్రభుత్వం ఎందుకు అని ప్రశ్నించారు. ఒక విజన్‌తో మెడికల్ కాలేజీలను తెచ్చాం. అన్నీ సర్వీసులు ఉండేలా మెడికల్ కాలేజీలను తీసుకొచ్చాం. ఉచితంగా సూపర్, మల్టీ స్పెషాలిటీ సేవలుంటాయి. పేదవాడి ఆరోగ్యానికి భరోసాగా మెడికల్ కాలేజీలను తెచ్చామని మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు కట్టబెట్టడమే అతిపెద్ద స్కాం. ఆ కాలేజీల్లో ప్రభుత్వమే జీతాలు ఇవ్వడం మరో స్కాం అని ఆరోపించారు. రూ.120 కోట్ల ప్రజాధనాన్ని జీతాల కింద ఎలా ఇస్తారు? కాలేజీలు ప్రైవేటుకు ఇచ్చి జీతాలు మీరెలా ఇస్తారు? ఇంతకంటే పెద్ద స్కాం ఉంటుందా? అని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక విజన్‌తో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తెచ్చింది. ప్రతి పార్లమెంట్‌ను ఒక జిల్లాగా చేయడం, ఆ జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీలను తీసుకొని రావడం, మెడికల్ కాలేజీతో పాటు టీచింగ్ హాస్పిటల్ సైతం అందుబాటులోకి వస్తుంది. టీచింగ్ హాస్పిటల్ అంటే ఓ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్. ఉచితంగా సూపర్, మల్టీ స్పెషాలిటీ సేవలుంటాయి. పేదవాడి ఆరోగ్యానికి భరోసాగా ఉంటుంది. వీటివల్ల సమీప ప్రైవేట్ ఆస్పత్రుల్లో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేయలేవన్నారు. దీనివల్ల మన పిల్లలు బాగుపడతారు. దీని వల్ల బాగుపడేది మన తల్లిదండ్రులు. మన పిల్లల తల్లిదండ్రులు. అలాంటి మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తే.. టీచింగ్ హాస్పిటల్స్ ప్రైవేట్ పరం అవుతాయి. పేదల నుంచి డబ్బులు వసూలు చేయడం. వాటిని పంచుకుంటారన్నారు. ఈ ప్రైవేటీకరణ వల్ల పేదల ఆరోగ్యం దెబ్బతింటుందని, ప్రైవేట్ ఆస్పత్రులు అడ్డగోలు ఛార్జీలు వసూలు చేసే అవకాశం పెరుగుతుందని జగన్ ఆవేదన వ్యక్తం. గవర్నర్ ఈ విషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# డీఎంకే ఒక దుష్ట శక్తి

శాంతిభద్రతలు, నీట్ పరీక్ష మినహాయింపు వంటి అంశాలపై స్టాలిన్ సర్కారును లక్ష్యంగా చేసుకున్నారు. "డీఎంకేకు, సమస్యలకు ఫెవికాల్‌తో అంటించినంత సంబంధం ఉంది. వాటిని వేరు చేయలేం" అంటూ ఎద్దేవా చేశారు. సభ ముగిశాక ప్రజలందరూ సురక్షితంగా ఇళ్లకు వెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సభకు రాజకీయంగానూ ప్రాధాన్యత ఏర్పడింది. ఇటీవల అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురై టీవీకేలో చేరిన సీనియర్ నేత, ఎన్నికల వ్యూహకర్త కేఏ సెంగొట్టయ్యన్ సొంత ప్రాంతమైన విజయమంగళం సమీపంలో ఈ సభను నిర్వహించడం గమనార్హం. ద్రవిడ ఉద్యమాలకు బలమైన పట్టున్న పశ్చిమ తమిళనాడులో తన ఉనికిని చాటుకునేందుకు విజయ్ ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. కరూర్ విషాదం పునరావృతం కాకుండా ఈ సభకు పోలీసులు కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. సుమారు 35,000 మంది హాజరవుతారని అంచనా వేసి, 1300 మందికి పైగా పోలీసులను మోహరించారు. సభా ప్రాంగణాన్ని 72 బాక్సులుగా విభజించి, ఒక్కో బాక్సులో 500 మందికి మించి ఉండకుండా చర్యలు తీసుకున్నారు. గర్భిణులు, చిన్న పిల్లలతో వచ్చే వారికి అనుమతి నిరాకరించారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పోటీ చేయనుంది. ఎంజీఆర్, జయలలిత మాదిరిగా రాజకీయాల్లో విజయం సాధించాలని విజయ్ భావిస్తున్నప్పటికీ, దశాబ్దాలుగా పాతుకుపోయిన డీఎంకే, అన్నాడీఎంకేల ఆధిపత్యాన్ని అధిగమించడం ఆయనకు పెద్ద సవాలుగా మారనుంది.

# సర్టిఫికెట్ లేనిదే ఇంధనం లేదు

న్యూఢిల్లీ: దేశ రాజధాని న్యూఢిల్లీలో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి ఢిల్లీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గురువారం నుండి నగరంలో 'నో పియుసి, నో ఫ్యూయల్' చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నారు. కాలుష్య ధృవీకరణ పత్రం లేని వాహనాలకు పెట్రోల్ బంకుల నుండి ఇంధనం సరఫరా చేయబడదని నిబంధన విధించారు. బిఎస్ 6 ప్రమాణాలకు అనుగుణంగా లేని నగరం వెలుపలి ప్రైవేట్ వాహనాలను కూడా ఢిల్లీలోకి ప్రవేశించకుండా నిషేధించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, సిఎన్‌జి వాహనాలు మరియు అవసరమైన సేవలకు సంబంధించిన వాహనాలను ఆంక్షల నుండి మినహాయించారు. ఈ చర్యలు జిఆర్‌ఎపి పరిమితుల యొక్క నాల్గవ దశలో భాగం. పెట్రోల్ పంపుల వద్ద పోలీసు అధికారులు, రవాణా శాఖ అధికారులను మోహరించారు. కెమెరాలను ఉపయోగించడం, వాహనాల నంబర్ ప్లేట్‌లను తనిఖీ చేయడం ద్వారా సర్టిఫికెట్ల చెల్లుబాటును నిర్ధారిస్తున్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై భారీ జరిమానాలు, వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో సహా చర్యలు తీసుకుంటామని పర్యావరణ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా ప్రకటించారు. కాలుష్యాన్ని తగ్గించడంలో భాగంగా, ప్రభుత్వ మరియు ప్రైవేట్ కార్యాలయాలలో 50 శాతం మంది ఉద్యోగులకు 'ఇంటి నుండి పని' తప్పనిసరి చేశారు.

# రిటైర్మెంట్‌కు ముందు ఈ సిక్సర్లు ఏంటి.?

ఆగ్రహం వ్యక్తం చేసింది. పదవీ విరమణకు కేవలం 10 రోజుల ముందు తన సస్పెన్షన్‌ను సవాలు చేస్తూ మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది. సదరు న్యాయమూర్తి జారీ చేసిన రెండు న్యాయపరమైన ఆదేశాలతో ఈ సస్పెన్షన్ కూ లింక్ ఉందనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై దాఖలైన పిటిషన్ పై విచారణ జరిపిన ఛీఫ్ జస్టిస్ సూర్యకాంత్ పదవీ విరమణకు ముందు పిటిషనర్ సిక్సులు కొట్టడం ప్రారంభించారు, ఇది దురదృష్టకర ధోరణి అన్నారు. తాను దాని గురించి మరింత వివరణ ఇవ్వదల్చుకోలేదన్నారు. జిల్లా న్యాయమూర్తి వాస్తవానికి నవంబర్ 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. కానీ రెండు న్యాయపరమైన ఆదేశాల కారణంగా నవంబర్ 19న సస్పెండ్ అయ్యారు. ఆయన మొదట నవంబర్ 30న పదవీ విరమణ చేయాల్సి ఉండగా, రాష్ట్రం తన ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచిన తర్వాత ఆయన పదవీ విరమణను ఒక సంవత్సరం పాటు వాయిదా వేయాలని సుప్రీంకోర్టు నవంబర్ 20న మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిపై ఛీఫ్ జస్టిస్ ఫైర్ అయ్యారు. ఆ రెండు ఉత్తర్వులు జారీ చేసినప్పుడు జడ్జీకి తన పదవీ విరమణ వయస్సును ఒక సంవత్సరం పెంచారని తెలియదని, రిటైర్మెంట్ కు ముందు చాలా ఉత్తర్వులు జారీ చేసే ధోరణి పెరుగుతోందన్నారు. జిల్లా న్యాయమూర్తి తన సస్పెన్షన్‌ను సవాలు చేస్తూ హైకోర్టును ఎందుకు ఆశ్రయించలేదని కూడా ధర్మాసనం ప్రశ్నించింది. తప్పుడు ఉత్తర్వులు జారీ చేసినందుకు జడ్జిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోలేమని, అయితే సదరు ఆదేశాలు నిజాయితీగా లేకపోతే మాత్రం చర్యలు ఉంటాయని క్లారిటీ ఇచ్చింది.

# భూవివాదాల్లో నేతల జోక్యం ఉంటోందన్న పవన్

రాజకీయ నాయకుల ప్రమేయం ఉంటోందంటూ తన దృష్టికి వచ్చిన ఫిర్యాదుల గురించి ప్రస్తావించారు. దీనిపై తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, భూ వివాదాల్లో రాజకీయ నాయకుల జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించవద్దని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు గట్టిగా ఆదేశాలు జారీ చేశారు. అలాంటి ఫిర్యాదులు పునరావృతం కాకూడదని, భూ కబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని, అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించాలని తేల్చి చెప్పారు. విశాఖ, అనకాపల్లి సహా మరికొన్ని జిల్లాల్లో భూ కబ్జాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు.

### గత పాలనలో రికార్డులు అస్తవ్యస్తం

గత ఐదేళ్ల పాలనలో (2019-24) భూ రికార్డుల వ్యవస్థను పూర్తిగా అస్తవ్యస్తం చేశారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అత్యుత్తమంగా నిర్వహించిన రెవెన్యూ రికార్డులను గందరగోళంలోకి నెట్టారని అన్నారు. ప్రజలకు చెందాల్సిన భూములను దక్కకుండా చేసేందుకు, వాటిని వివాదాల్లోకి నెట్టేందుకు ఉద్దేశపూర్వకంగా 22ఏ జాబితాలో చేర్చారని విమర్శించారు. దీనివల్లే ప్రస్తుతం ప్రజా సమస్యల పరిష్కార వేదికలకు వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికం భూ సంబంధిత సమస్యలే ఉంటున్నాయని పేర్కొన్నారు. భూ సమస్యలను వంద శాతం పరిష్కరించి, ప్రజలకు సక్రమంగా డాక్యుమెంట్లు అందించాల్సిన పూర్తి బాధ్యత కలెక్టర్లదేనని పునరుద్ఘాటించారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా జాయింట్ కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు.

### రికార్డుల ప్రక్షాళన, డిజిటలైజేషన్‌కు చర్యలు

భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత తీసుకువచ్చేందుకు అన్ని రిజిస్ట్రేషన్, ఆస్తి పత్రాలను డిజిటలైజేషన్ చేస్తున్నామని సీఎం వివరించారు. లింక్ డాక్యుమెంట్లను కూడా డేటా వేర్‌హౌస్‌లో భద్రపరుస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలను వెంటనే జారీ చేయాలని, ఇకపై ప్రింటింగ్ అయిన చోట నుంచే నేరుగా రైతులకు చేరేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, రిజిస్ట్రేషన్ చేసుకున్న డాక్యుమెంట్లు కూడా నేరుగా యజమానుల ఇళ్లకే చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. 20-30 ఏళ్లుగా ఇళ్లలో నివసిస్తున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. చివరగా, జిల్లాల వారీగా రెవెన్యూ రాబడులపై దృష్టి సారించాలని, పన్ను ఎగవేతలు, మానిప్యులేషన్ జరగకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రం ఒక్కరోజు కూడా ఆదాయం కోల్పోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. మొత్తంగా, భూ వివాద రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్' అవార్డు

సదస్సులోని మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు తమ స్థానాల్లోంచి లేచి నిలబడి (స్టాండింగ్ ఓవేషన్) ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ఈ అవార్డు రావడం గర్వకారణమని అన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఈ అవార్డు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని, 'ఎకనామిక్ టైమ్స్' హెడ్డింగ్ చూస్తేనే గూస్‌బంప్స్ వస్తున్నాయని వ్యాఖ్యానించారు. "గతంలో రాష్ట్రం దాదాగిరిని చూసింది, ఇప్పుడు అభివృద్ధి వైపు పరుగులు పెట్టే నాయుడుగిరిని చూస్తోంది" అని అన్నారు. ఇప్పటివరకు కేంద్రంలో ఉన్నవారికే ఈ పురస్కారం దక్కిందని, తొలిసారిగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రికి లభించడం ఇదే ప్రథమమని వివరించారు. అనంతరం సీఎం చంద్రబాబు స్పందిస్తూ ఈ ఘనత తనది కాదని, తన సహచరులు, అధికారులు, కలెక్టర్లదేనని అన్నారు. తాను సాధారణంగా అవార్డులు స్వీకరించనని, గతంలో విదేశీ యూనివర్సిటీలు డాక్టరేట్లు ఇస్తామన్నా సున్నితంగా తిరస్కరించానని గుర్తుచేశారు. "గత ప్రభుత్వంలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. ఇప్పుడు గేర్ మార్చి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. 18 నెలల్లో 25 కొత్త పాలసీలు తెచ్చాం" అని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం దేశంలోనే తొలిసారిగా ఎస్క్రో ఖాతాను తీసుకొస్తున్నామని, పాలనలో కూడా 'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్' అమలు చేయాలని నిర్ణయించామని వెల్లడించారు.

# బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం ప్రారంభమైంది

అభినందన సభలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పెద్దలు చెప్పినట్లు ఎక్కడైతే అధికారం పోగొట్టుకున్నామో, అక్కడే వెతుక్కోవాలని, ఈరోజు సర్పంచ్ ఎన్నికల ఫలితాలు ఆ ఉత్సాహాన్ని ఇస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. రెండేళ్ల కిందట అసెంబ్లీ ఎన్నికల్లో కొద్దిపాటి ఓట్ల తేడాతో నిరాశ ఎదురైనా, నేడు భువనగిరిలో 56 మంది, ఆలేరులో 74 మంది, మునుగోడులో 15 మంది, తుంగతుర్తిలో 9 మంది, నకిరేకల్‌లో 7 మంది.. ఇలా జిల్లా వ్యాప్తంగా మొత్తం 161 మంది సర్పంచులను గెలిపించుకోవడం సామాన్య విషయం కాదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయం అత్యంత గలీజుగా మారిందని కేటీఆర్ విమర్శించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నూతనకల్ మండలంలో మల్లయ్య యాదవ్‌ను కిరాతకంగా చంపడం, నల్గొండలో అభ్యర్థిపై దాడి చేసి అమానవీయంగా మూత్రం తాగించి అవమానించడం వంటి ఘటనలు కాంగ్రెస్ నాయకుల వికృత మనస్తత్వానికి నిదర్శనమని అన్నారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ ఎప్పుడూ ఇలాంటి చిల్లర రాజకీయాలకు తావివ్వలేదని కేటీఆర్ అన్నారు. అధికారులు కూడా అధికార పక్షానికి కొమ్ముకాస్తూ, గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థులను దొంగతనంగా ఓడించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. 150కి పైగా గ్రామాల్లో జరుగుతున్న ఈ అన్యాయంపై కోర్టుల ద్వారా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

# బీజేపీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ కార్యకర్తల యత్నం

నిరసన ర్యాలీకి సిద్ధమయ్యారు. వారు సమీపంలోనే ఉన్న బీజేపీ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు గాంధీ భవన్ ఎదుట బైఠాయించారు. నగరం నడిబొడ్డున ఉన్న నాంపల్లి ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. కాంగ్రెస్ నాయకులు గాంధీ భవన్ ప్రాంగణం నుంచి బయటకు రాకుండా పోలీసులు గేట్లు మూసివేశారు. వారు కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో గాంధీ భవన్ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నిరసనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, నేషనల్ హెరాల్డ్ విషయంలో కేంద్ర ప్రభుత్వం గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకోవడం మానివేయాలని అన్నారు.

తన తప్పును బీజేపీ అంగీకరించి సోనియా గాంధీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకుడిని లక్ష్యంగా చేసుకుని, కాంగ్రెస్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టింది. వరంగల్, నల్గొండ, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్ సహా వివిధ ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులను పెద్ద ఎత్తున మోహరించారు. కరీంనగర్‌లో బండి సంజయ్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించగా, బీజేపీ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు నిలువరించారు.

## ఇరుదేశాల పరస్పరం సహకరించుకోవాలి

ప్రాంతీయ శాంతి, భద్రత, అనుసంధానంలో భారత్, ఇథియోపియా సహజ భాగస్వాములని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఇథియోపియాలో ఉంటే సొంతింట్లో ఉన్నట్లుందని తెలిపారు. ఈ మేరకు ఆ దేశ పార్లమెంటులో బుధవారం మోడీ ప్రసంగించారు. ప్రాచీన జ్ఞానం, ఆధునిక ఆశయాలు కలిగిన ఈ దేశ ప్రజాస్వామ్య మందిరంలో ఉండటం గర్వకారణమని అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలైన భారత్, ఇథియోపియా ఒకదానికొకటి పరస్పరం సహకరించుకోవాలన్నారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై చర్చలు కొనసాగుతున్నట్టు తెలిపారు. "ఇథియోపియా, గుజరాత్ రెండు కూడా సింహాలకు ప్రసిద్ధి. ఈ దేశంతో భారత్‌కు సత్సంబంధాలు ఉన్నాయి. ప్రపంచమంతా వసుధైక కుటుంబమైంది. భారతీయ టీచర్లు చాలా మంది ఇథియోపియాలో సేవలు అందిస్తున్నారు. ఇక్కడ అత్యధిక విదేశీ పెట్టుబడిదారులుగా భారతీయులే ఉన్నారు. వీరు వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టి ఉపాధి కల్పిస్తున్నారు" అని మోడీ తెలిపారు. ఇథియోపియా పార్లమెంట్, ప్రజలు, ప్రజాస్వామ్య ప్రయాణం పట్ల తనకు లోతైన గౌరవం ఉందని ప్రధానమంత్రి అన్నారు. 1.4 బిలియన్ భారతీయుల శుభాకాంక్షలను తీసుకొచ్చానని, ఇథియోపియా పార్లమెంట్, ప్రజలు, వారి ప్రజాస్వామ్య ప్రయాణానికి తాను గాఢమైన గౌరవం వ్యక్తం చేస్తున్నానని ప్రధాని తెలిపారు. "ఈ భవనంలో ప్రజల సంకల్పమే రాష్ట్ర సంకల్పంగా మారుతుంది. ప్రజల చక్రం, రాష్ట్ర చక్రం సమన్వయంతో కదిలితే, అభివృద్ధి చక్రం ముందుకు సాగుతుంది" అని పేర్కొన్నారు. ఇథియోపియా అత్యున్నత పౌర పురస్కారం అందించినందుకు ప్రధాని అబిరు అహ్మద్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవాన్ని భారత ప్రజల తరఫున నమ్రతతో స్వీకరిస్తున్నానని అన్నారు. ఇథియోపియా ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన నాగరికతల్లో ఒకటని మోడీ కొనియాడారు. ఈ దేశ చరిత్ర పర్వతాల్లో, లోయల్లోనే కాక ప్రజల హృదయాల్లో కూడా జీవిస్తోందని చెప్పారు. భారత్–ఇథియోపియా మధ్య సాంస్కృతిక అను బంధాన్ని ప్రస్తావిస్తూ, భారత జాతీయ గీతం వందేమాతరంలోనూ, ఇథియో పియా జాతీయ గీతంలోనూ భూమిని తల్లిగా పేర్కొనడం విశేషమని తెలిపారు.

## ట్రిలియన్ డాలర్ల దిశగా ఎలన్ మస్క్



ప్రపంచంలోనే అత్యంత కుబేరుడు, ట్రంప్ సన్నిహితుడు ఎలన్ మస్క సంపద ఇటీవల భారీగా పెరుగుతోంది. మంగళవారం నాటికి ఆయన నికర సంపద 677 బిలియన్ డాలర్లకు చేరి ట్రిలియన్ డాలర్ల వైపు దూసుకుపోతోంది. మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ కేవలం నాలుగు నెలల క్రితం ఆగస్టులో ఉన్న విలువ కంటే రెట్టింపు అయ్యింది. ప్రస్తుతం స్పేస్‌ఎక్స్ విలువ 800 బిలియన్లకు చేరింది. మస్క్ సంపద ఒక్క రోజులోనే 168 బిలియన్ డాలర్లకు పెరిగింది. స్పేస్‌ఎక్స్‌లో ఆయన వాటా 42 శాతంతో 168 బిలియన్లుగా ఉంది. టెస్లాలో 12 శాతం వాటాతో 197 బిలియన్లకు చేరింది. మస్క్ కొత్త స్టార్టప్ ఎక్స్‌ఎఐ విలువ సుమారు 230 బిలియన్లకు పెరిగింది. ఇందులో మస్క్‌కు 53 శాతం. వాటా ఉంది. ప్రపంచంలో రెండో అత్యంత ధనవంతుడైన గూగుల్ సహ వ్యవస్థాపకుడు లారీ పేజ్ 252 బిలియన్ల సంపద కంటే ఎలన్ మస్క్ 425 బిలియన్లు ఎక్కువ సంపదను కలిగి ఉన్నారు. ముఖేష్ అంబానీ సంపద ప్రస్తుతం 111.4 బిలియన్లుగా ఉంది.

## మరో ఏడు దేశాలపై పర్యాటక నిషేధం



గతంలో 19 దేశాలపై పర్యాటక నిషేధం, ఆంక్షలు విధించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా మరో 20 దేశాలను ఆ జాబితాలో చేర్చారు. ఏడు దేశాలతో పాటు పాలస్తీనీయులపై పూర్తి స్థాయిలో పర్యాటక నిషేధాన్ని విధించారు. మరో పదిహేను దేశాల వారిపై ప్రవేశ ఆంక్షలు పెట్టారు. దేశ భద్రత, ప్రజల రక్షణ, బలహీనమైన తనిఖీ వ్యవస్థలు, అధిక వీసా ఓవర్‌స్టే రేట్లను ఇందుకు కారణాలుగా చూపారు. ట్రంప్ తాజా నిర్ణయంతో పర్యాటక నిషేధం, ప్రవేశ ఆంక్షలు విధించిన దేశాల సంఖ్య 39కి చేరింది. ప్రధానంగా ఉగ్రవాద కార్యకలాపాలు, అంతర్గత ఘర్షణ, అధిక వీసా ఓవర్‌స్టే రేట్ల కారణంగా తాజా నిర్ణయం తీసుకున్నామని అధ్యక్ష భవనం తెలిపింది. ఉగ్రవాద ముప్పు ఎక్కువగా ఉన్నందున బుర్కినా ఫాసో, మాలీ, నైగర్, నైజీరియా దేశాలపై చర్యలు తీసుకున్నామని చెప్పింది. కొన్ని దేశాల బీ–1, బీ–2, విద్యార్థి వీసా ఓవర్‌స్టే రేట్లు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంది. సంవత్సరాల తరబడి పౌర అశాంతి నెలకొన్న సిరియాలో పాస్‌పోర్టులు, పత్రాలు జారీ చేసేందుకు కేంద్ర అథారిటీ ఏదీ లేదని తెలిపింది. 'విదేశీ పౌరుల ప్రవేశాన్ని నిరోధించడానికి ఆంక్షలు, పరిమితులు అవసరం. ఎందుకంటే వారు ఎదుర్కొనే ప్రమాదాలను అంచనా వేయడానికి, ఆయా దేశాల ప్రభుత్వాల సహకారం పొందడానికి, మన వలస చట్టాలను అమలు చేయడానికి, ఇతర ముఖ్యమైన విదేశాంగ విధానం, జాతీయ భద్రత, ఉగ్రవాద నిరోధక లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన సమాచారం అమెరికా వద్ద లేదు' అని అధ్యక్ష భవనం ఫ్యాక్ట్–షీట్ వివరించింది.

తాజా ప్రకటన నుంచి చట్టబద్ధమైన శాశ్వత నివాసితులు, ప్రస్తుత వీసా హోల్డర్లు, దౌత్యవేత్తలు, అథ్లెట్లు, అమెరికా ప్రయోజనాల కోసం పని చేసే వ్యక్తులకు మినహాయింపు ఇచ్చారు. శ్వేతసౌధం ఫ్యాక్ట్–షీట్ ప్రకారం బర్కినా ఫాసో, మాలీ, నైగర్, దక్షిణ సూడాన్, సిరియా దేశాలపై పర్యాటక నిషేధం విధించారు. పాలస్తీనా అథారిటీ జారీ చేసిన పర్యాటక పత్రాలు ఉన్న వారిని కూడా జాబితాలో చేర్చారు. దీనితో పాటు లావోస్, సియర్రా లియోన్‌పై పూర్తి స్థాయిలో నిషేధం విధించారు. గతంలో ఈ రెండు దేశాలపై పాక్షిక ప్రవేశ ఆంక్షలు ఉండేవి. తాజాగా విధించిన నిషేధం, ఆంక్షలు 2026 జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయి. ప్రస్తుతం 19 దేశాలపై అమలులో ఉన్న పర్యాటక నిషేధం, ఆంక్షలను 30 దేశాలకు విస్తరించాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోందని రెండు వారాల క్రితమే హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం కార్యదర్శి క్రిస్టీ నోయమ్ తెలిపారు. అయితే ఎన్ని దేశాలపై నిషేధాన్ని విధిస్తారో ఆమె అప్పుడు తెలపలేదు.

## అహ్మదాబాద్‌లోని 10 స్కూళ్లకు బాంబు బెదిరింపులు

అహ్మదాబాద్ : గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ నగరంలో పది పాఠశాలలకు బుధవారం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఈరోజు మధ్యాహ్నం 1.11 సమయంలో స్కూళ్లను బాంబులతో పేల్చేస్తామని ఈరోజు ఉదయం 8.35 గంటల సమయంలో ఈ బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.

దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పాఠశాలల్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. ఎలాంటి బాంబులు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. థాల్టేలోని జెబర్ స్కూల్, ఉద్గమ్ స్కూల్, గురుకుల్ రోడ్‌లోని మహారాజ అగ్రసేన్ స్కూల్, మకర్బాలోని డిఎవి ఇంటర్నేషనల్ స్కూల్, వస్త్రపూర్‌లోని నిర్మాణ్ స్కూల్, విజాల్‌పూర్‌లోని జైడల్ స్కూల్, అదలాజ్‌లోని డివైన్ స్కూల్, డివైన్ చైల్డ్ స్కూల్, కాలోల్‌లోని ఆవిష్కార్ స్కూల్, బోడక్దేవ్‌లోని అహ్మదాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్, బోపాల్‌లోని న్యూ తులిప్ స్కూల్, డిపిఎస్‌లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. కేవలం స్కూళ్లకే కాదు.. అదేవిధంగా సబర్మతి జైల్లో కూడా బాంబులు పేలుతాయని గుర్తుతెలియని వ్యక్తులు ఆ మెయిల్స్‌లో హెచ్చరించారు. అదేవిధంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోరు పేర్లను కూడా మెయిల్స్‌లో ప్రస్తావించినట్లు అధికారులు వెల్లడించారు.

# చమురు ట్యాంకర్ల దిగ్బంధం

ఆంక్షల నడుమ వెనిజులాకు రాకపోకలు సాగిస్తున్న చమురు ట్యాంకర్లను పూర్తి స్థాయిలో దిగ్బంధించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ వేదికలో ఓ పోస్ట్ పెట్టారు. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోపై ఆయన మరోసారి విషం చిమ్ముతూ దొంగిలించిన చమురు సంపదను ఉపయోగిస్తూ నేరాలు, ఉగ్రవాదం, మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 'వెనిజులాను యుద్ధ నౌకలు పూర్తిగా చుట్టుముట్టాయి. దక్షిణ అమెరికాలో మునుపెన్నడూ ఈ విధంగా మోహరింపు జరగలేదు' అని తెలిపారు. అమెరికా చమురును, భూమిని, ఇతర ఆస్తులను వెనిజులా తిరిగి ఇవ్వని పక్షంలో ఈ మోహరింపు మరింత పెరుగుతుందని హెచ్చరించారు. ట్రంప్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఆంక్షలను ఎదుర్కొంటూ వెనిజులాకు రాకపోకలు సాగిస్తున్న చమురు ట్యాంకర్లను అమెరికా దళాలు అడ్డుకుంటాయి. అయితే ఎన్ని దిగ్బంధాలు ఉంటాయి, మిత్ర దేశాలు కూడా ఇందులో భాగస్వాములవుతాయా అన్నది ఆయన వివరించలేదు. ట్రంప్ తన తాజా చర్యను ఇమ్మిగ్రేషన్‌తో ముడిపెట్టారు. బైడెన్ ప్రభుత్వ హయాంలో అమెరికాలో ప్రవేశించిన వెనిజులా ప్రజలను త్వరితగతిన తిప్పి పంపుతామని చెప్పారు. వెనిజులాపై అమెరికా కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో యుద్ధ మేఘాలు కమ్ముకొస్తున్నాయి. అమెరికా సైన్యం ఇప్పటికే కరేబియన్‌లోనూ, వెనిజులా జలాల సమీపంలోనూ పెద్ద ఎత్తున మోహరించింది. ఆ ప్రాంతంలో ఉన్న యుద్ధ నౌకలు అదును కోసం వేచి చూస్తున్నాయి. మరోవైపు గగనతల నిఘా కూడా కొనసాగుతోంది. మాదక ద్రవ్యాలను రవాణా చేస్తున్నాయన్న కారణంతో అనేక ఓడలను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. ఈ వారం ప్రారంభంలో వెనిజులా తీరం సమీపంలో ఓ చమురు ట్యాంకర్‌పై అమెరికా దాడి చేసి దానిని తన ఆధీనంలోకి తీసుకుంది. అయితే ఈ చర్యలన్నీ తనను పదవీచ్యుతుడిని చేయడాని కేనని మదురో తెలిపారు. అమెరికా దాడులపై మౌనం వహిస్తున్న ఐరాసపై ఆయన మండిపడ్డారు.

## ద్వేషపూరిత ప్రసంగాలపై ఆస్ట్రేలియాలో చట్టాలు



బోండి కాల్పుల తర్వాత ద్వేషపూరిత ప్రసంగాలను అరికట్టడానికి ఆస్ట్రేలియా చట్టాలను ప్రవేశపెట్టనుంది. ద్వేషపూరిత ప్రసంగాలను అరికట్టడానికి ఆస్ట్రేలియా విస్తృత సంస్కరణలను ప్రవేశపెట్టనుందని గురువారం ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్ అన్నారు.ఆదివారం సిడ్నీలోని ప్రసిద్ధ బోండి బీచ్‌లో వందలాది మంది హనుక్కాను జరుపుకుంటుండగా ముష్కరులు కాల్పులు జరిపారు. ఇస్లామిక్ స్టేట్ ప్రేరణతో జరిగిన దాడిలో 15 మంది మరణించారు. ఇది దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని, పెరుగుతున్న యూదు వ్యతిరేకతపై భయాలకు దారితీసిందని అన్నారు. ద్వేషపూరిత ప్రసంగం, హింసను ప్రోత్సహించే వ్యక్తులపై అభియోగాలు మోపడం సులభతరం చేసే చట్టాన్ని ప్రవేశపెట్టాలని, అలాగే భారీగా జరిమానాలను విధించాలని అల్బనీస్ తెలిపారు. బోండి కాల్పుల ఘటనపై అల్బనీస్ మాట్లాడుతూ "ఆస్ట్రేలియన్లు షాక్ అయ్యారు. కోపంగా ఉన్నారు. నేను కోపంగా ఉన్నాను. ఈ దుష్ట విపత్తును ఎదుర్కోవడానికి మనం మరింత చేయాల్సిన అవసరం ఉందని స్పష్టంగా తెలుస్తుంది" అని సంస్కరణలను ప్రకటిస్తూ ఒక వార్తా సమావేశంలో అన్నారు.

## మయామిలో ఉక్రెయిన్‌తో చర్చలు జరపనున్న అమెరికా, రష్యా



ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి అధ్యక్షుడు ట్రంప్ ప్రణాళికపై కొత్త చర్చల కోసం అమెరికా మరియు రష్యా అధికారులు ఈ వారాంతంలో మయామిలో సమావేశం అవుతారని వైట్‌హౌస్ అధికారి ఒకరు బుధవారం తెలిపారు. ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఆయన అల్లుడు జారెడ్ కుష్నర్‌లు అమెరికా ప్రతినిధులుగా చర్చల్లో పాల్గొంటారని, పుతిన్ ఆర్థిక రాయబారి కిరిల్ డిమిత్రివ్ రష్యన్ ప్రతినిధి బృందంలో ఉంటారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అయితే వైట్‌హౌస్ ఈ వివరాలను నిర్ధారించాల్సి వుంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి ఇటీవలి వారాల్లో అంతర్జాతీయంగా దౌత్య చర్చలు జరుగుతున్నాయి. విట్కాఫ్ మరియు కుష్నర్ నవంబర్‌లో క్రెమ్లిన్‌లో పుతిన్ ను కలిసిన సంగతి తెలిసిందే. ఉక్రేనియన్లు మరియు యూరోపియన్ నేతలతో బెర్లిన్‌లో సమావేశమయ్యారు. అయితే చర్చలు ఫలించలేదు. భవిష్యత్తు భద్రతా హామీల విషయంలో పురోగతి ఉందని ఉక్రెయిన్ మరియు అమెరికా ప్రకటించాయి. ఉక్రెయిన్ ఏ భూభాగాన్ని వదులుకోవాల్సి వుంటుందనే అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తమ లక్ష్యాలను 'కచ్చితంగా' సాధిస్తుందని, వాటిలో భాగంగా తమ సొంతమని భావించే భూభాగాలను కూడా స్వాధీనం చేసుకోవడం కూడా ఉందని రష్యా అధ్యక్షుడు పుతిన్ బుధవారం ఒక సమావేశంలో స్పష్టం చేశారు.

## 'వైష్ణోదేవి' అడ్మిషన్లపై సంఘ్ పరివార్ విద్వేషం




శ్రీనగర్ : ఆర్ఎస్ఎస్ దాని పరివారం దేశవ్యాప్తంగా విద్యా సంస్థల్లో విద్వేషం పెంచేందుకు యత్నిస్తున్నాయి. తాజాగా శ్రీనగర్‌లోని శ్రీ మాతా వైష్ణో దేవి మెడికల్ కాలేజీలో జరిగిన మొదటి బ్యాచ్ అడ్మిషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు ఆందోళనలు చేస్తున్నాయి. మొదటి బ్యాచ్‌లో 50మంది సెలక్ట్ కాగా వారిలో 44మంది ముస్లిం కమ్యూనిటీకి చెందినవారే కావడంపై వారు తీవ్రంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. వీరిలో సగం మందికి పైగా మహిళలే. ఈ అడ్మిషన్లను పరిశీలించాలని ఆ సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికి నెలన్నర రోజులుగా తరగతులు సాగుతున్నాయి.


విద్యార్థుల మధ్య ఎలాంటి ఉద్రిక్తతలు, గందరగోళాలు కనిపించడం లేదు. వైష్ణో దేవి ఆలయానికి 16కిలోమీటర్ల దూరంలో వున్న మెడికల్ కాలేజీలో ఈ నిరసనలు, గందరగోళాలు తలెత్తలేదు. కానీ కేంపస్ వెలుపల ఇవి వూపందుకుంటున్నాయి. వైష్ణోదేవి ఆలయం ఇచ్చే విరాళాల కారణంగా హిందువులకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి సీట్లు రిజర్వ్ చేయాలని సంఘ్ పరివార్ మూకలు ఆందోళన చేస్తున్నాయి. అయితే కాలేజీ యాజమాన్యం ఇప్పటివరకు నీట్ పరీక్ష ద్వారానే మెరిట్ ఆధారిత నియామకాలే జరిపామని ప్రకటించింది. మొత్తం 16విభాగాల్లో 2800మంది విద్యార్థులు వుండగా, వారిలో కేవలం 2శాతం మాత్రమే ముస్లిం విద్యార్థులున్నారని అధికారులు తెలిపారు.. మిగిలినవారందరూ దేశవ్యాప్తంగా వివిధ కమ్యూనిటీలకు చెందినవారని కెంపస్‌లో ఎటువంటి ఘర్షణలు జరగలేదని బయటి వ్యక్తులు, సంస్థలు ఉద్దేశపూర్వకంగా సమస్యలను సృష్టిస్తున్నాయని పలువురు భావిస్తున్నారు..

## విబి-జి రామ్ జి బిల్లును వెనక్కి తీసుకోవాలి



న్యూఢిల్లీ: విజి–జిఆర్ఎఎంజి బిల్లును తిరస్కరించాలని, ఎంజిఎన్ఆర్ఇజిఎను కాపాడాలని ఈ నెల 19న జాతీయ కార్యాచరణ దినంగా పాటించాలని వ్యవసాయ కార్మిక సంఘాలు, మేధావులు పిలుపునిచ్చారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో యోగేంద్ర యాదవ్ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు, మేధావులు మాట్లాడారు. ప్రతిపాదిత వికసిత్ భారత్ – గ్యారెంటీ పర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (విజి–జిఆర్ఎఎంజి) బిల్లును ఖండించారు. కార్మికులు, కార్మిక సంఘాలతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా ప్రవేశపెట్టిన ఈ బిల్లు, ఎంజిఎన్ఆర్ఇజిఎ చట్టాన్ని రద్దు చేస్తుందని విమర్శించారు. ఉపాధి హామీని కేంద్ర ప్రభుత్వం దయా దాక్షిణ్యాలపై నడిచే ఒక పథకంగా మారుస్తుందన్నారు. జెఎన్‌యు ప్రొఫెసర్, కేరళ ప్రణాళిక బోర్డు మాజీ వైస్ ఛైర్మన్ ప్రభాత్ పట్నాయక్ గ్రామీణ సంక్షోభ సమయాల్లో హామీ ఇవ్వబడిన ఉపాధి హక్కు కీలకమైందిగా చెప్పారు. రాజస్తాన్‌లోని బీవార్‌కు చెందిన వితంతువు కమలాదేవి 18 ఏళ్లుగా ఎన్ఆర్ఇజిఎలో పనిచేస్తున్నారని, ఆమె భర్త మరణించినప్పుడు, ఆమెకు భూమి లేదా పిల్లలు లేనప్పుడు ఎన్ఆర్ఇజిఎ తన ఏకైక ఆదాయ వనరని పేర్కొన్నారు. ఎన్ఆర్ఇజిఎ లేకుండా ఆమె ఎలా బతకగలరు? అని అన్నారు. ఆర్థికవేత్త ప్రొఫెసర్ జయతి ఘోష్ మాట్లాడుతూ.. ఈ బిల్లు దేశంలో సమాఖ్యవాదానికి ఎదురయ్యే సవాల్ అని చెప్పారు. ముఖ్యంగా ప్రతిపక్ష రాష్ట్రాలకు వ్యతిరేకంగా నిధులను కేటాయించకుండా దీన్ని ఆయుధంగా ఉపయోగించే ధోరణిలో ఈ బిల్లును రూపొందించారు. అయితే, కొత్త బిల్లు ద్వారా కొత్త ప్రాంతాలు, పనులను నిర్ణయించడానికి కేంద్రానికి పూర్తి అధికారాలను ఇస్తుందని విమర్శించారు. ఈ బిల్లులో అత్యంత ప్రమాదకరమైనది ఏమిటంటే, బడ్జెట్‌పై పరిమితిని కేంద్రం విధిస్తుందన్నారు. అంతకుమించి రాష్ట్రాలు ఈ పథకానికి 100 శాతం నిధులు సమకూర్చాల్సి ఉంటుందని తెలిపారు. ఇది ఉపాధి హామీ ఎక్కువగా అవసరమయ్యే పేద రాష్ట్రాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని తెలిపారు. ఆర్థికవేత్త, సామాజిక కార్యకర్త జీన్ డ్రైజ్ మాట్లాడుతూ.. 'ఏ చట్టం వల్ల భారతదేశాన్ని విశ్వ గురువు అని పిలవవచ్చో, అది ఎన్ఆర్ఇజిఎనే' అని అన్నారు. కొత్త బిల్లు ద్వారా కేంద్రానికి ప్రమాదకరమైన విచక్షణాధికారాలు ఇస్తుందన్నారు. 2021 నుండి బెంగాల్‌లో పనుల నిలిపివేత, వివక్షాపూరిత సాంకేతిక చర్యలు, నిధుల కోతలు వంటి అంశాలను గుర్తుచేశారు. కొత్త బిల్లును వెనక్కి తీసుకొని, ఎన్ఆర్ఇజిఎను బలోపేతం చేసేవరకు తాము నిరసనలు ఆపమన్న శ్రావణి దేవి మాటలను డ్రైజ్ పునరుద్ఘాటించారు.

## ఉపాధి హామీలో మార్పులను వ్యతిరేకిస్తూ 22న దేశవ్యాప్త నిరసనలు




న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ)లో కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న మార్పులను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఈ నెల 22న నిరసన దినం పాటించాలని ఐదు వామపక్ష పార్టీలు సంయుక్తంగా పిలుపిచ్చాయి. ఈ మేరకు సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, ఆర్ఎస్‌పి, ఎఐఎఫ్‌బి నేతలు ఎం.ఎ.బేబీ, డి.రాజా, దీపాంకర్ భట్టాచార్య, మనోజ్ భట్టాచార్య, జి.దేవరాజన్‌లు ఒక బుదవారం ప్రకటన విడుదల చేశారు. యుపిఎ ప్రభుత్వంపై ఆనాడు వామపక్షాలు తీసుకువచ్చిన ఒత్తిడి ఫలితంగా రూపుదిద్దుకున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మౌలిక స్వభావాన్ని మార్చాలన్న బిజెపి ప్రభుత్వ చర్యను వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ చట్టం స్థానే కేంద్రం కొత్తగా తీసుకురావాలనుకుంటున్న వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)బిల్లు, 2025కు వ్యతిరేకంగా నిరసనలు తెలియచేసేందుకు ఈ నెల 22వ తేదీన పెద్ద సంఖ్యలో ప్రజలు ముందుకు రావాలని వామపక్షాలు పిలుపిచ్చాయి. ఎంజిఎన్ఆర్ఇజిఎ అనేది పరిమిత స్థాయిలో పనిచేసే హక్కును కల్పించే సార్వత్రిక, డిమాండ్ ఆధారిత చట్టం. కానీ కొత్తగా తీసుకువచ్చిన బిల్లు ఈ చట్టం స్వభావాన్ని మారుస్తోంది. కనీసం ఈ పరిమిత హక్కును కూడా ప్రజలకు అందకుండా నిరాకరిస్తోంది. డిమాండ్‌కు తగినట్లుగా నిధులను కేటాయించాల్సిన బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వానికి చట్టబద్ధంగా తప్పిస్తుంది. ఇక ఉపాధి హామీని వంద నుండి 125 రోజులకు పెంచుతున్నామని ప్రభుత్వం ఆకర్షణీయంగా వెల్లడించింది. అయితే ఉపాధి కార్డులను హేతుబద్ధీకరిస్తున్నామన్న పేరుతో పెద్ద సంఖ్యలో గ్రామీణ కుటుంబాలను ఈ బిల్లు మినహాయిస్తోంది. వ్యవసాయ పనులు రద్దీగా వుండే సమయాల్లో 60రోజుల వరకు ఉపాధిని నిలుపు చేయడం వల్ల అత్యంత అవసరమైన సమయాల్లో గ్రామీణ కార్మికులకు పని నిరాకరించబడుతుందని, తద్వారా వారిని భూస్వాములపై ఆధారపడేలా చేస్తుందని వామపక్షాలు విమర్శించాయి. దీంతోపాటు డిజిటల్ హాజరును తప్పనిసరి చేయడంతో పని ఒత్తిడి పెరుగుతుందని, వారి హక్కులు నిరాకరించబడడంతో పాటూ కార్మికులకు తీవ్రంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రకటనలో వివరించారు.

## కేరళ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో 19 సినిమాలకు నిరాకరణ

తిరువనంతపురం : కేంద్ర సమాచార, ప్రసార (ఐ అండ్ బి) మంత్రిత్వశాఖ నిరాశజనకమైన వైఖరితో వ్యవహరించింది. రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలోని కేరళ చలచిత్ర అకాడమీ నిర్వహిస్తున్న 30వ ఎడిషన్ ఉత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో 82 దేశాల నుండి 206 చిత్రాలు ప్రదర్శనకు ఎంపికయ్యాయి. అయితే ఇందులో సినిమాకు పాఠ్యపుస్తకంగా పరిగణించే 'బాటిల్‌షిప్ పోటెంకిన్' వంటి క్లాసిక్స్‌తో సహా పలు చిత్రాలు ప్రదర్శనకు నోచుకోలేదు. మొత్తంగా 19 చిత్రాలను ప్రదర్శించడానికి ఐఅండ్‌బి శాఖ అనుమతి నిరాకరించడంపై చిత్రోత్సవం వేదికపై తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. రాజకీయ చిత్రాలను చూడకుండా సినిమా ప్రేక్షకులను అడ్డుకోవాలన్న సంఘపరివార్ ద్వేషం ఫలితంగా ముందుగా నిర్ణయించిన అనేక చిత్ర ప్రదర్శనలను కేంద్రం రద్దు చేసింది. సెర్గి ఐన్‌స్టీన్ దర్శకత్వం వహించిన వందేళ్ళ నాటి సోవియట్ క్లాసిక్ అయిన బాటిల్‌షిప్ పోటెంకిన్‌తో పాటూ అనుమతి రద్దైన సినిమాల్లో 'ది అవర్ ఆఫ్ ది ఫర్నేసెస్' కూడా వుంది. అలాగే చిత్రోత్సవం ప్రారంభ చిత్రమైన పాలస్తీనా 36, స్పానిష్ చిత్రం బీఫ్, 2017లో ఐఎఫ్ఎఫ్‌కెలో సువర్ణ చకోరం గెలుచుకున్న పాలస్తీనా చిత్రం వజీబ్ వంటి చిత్రాలు కూడా ఈ జాబితాలో వున్నాయి. పాలస్తీనా చిత్ర ప్యాకేజీలో భాగమైన 'వన్స్ అపాన్ ఎ టైమ్ ఇన్ గాజా'తో సహా పలు రాజకీయ చిత్రాలు భారీ స్క్రూటినీని ఎదుర్కొన్నాయి. 2024లో కేన్స్ చిత్రోత్సవంలో విమర్శకుల ప్రశంసలు అందుకున్న, సంధ్య సూరి దర్శకత్వం వహించిన ఇండియన్–ఇంటర్నేషనల్ ప్రొడక్షన్ అయిన సంతోష్ కూడా రద్దైన చిత్రాల జాబితాలో వుంది. ఐఅండ్‌బి మంత్రిత్వ శాఖ అసంబద్ధంగా, ఏకపక్ష వైఖరితో తీసుకున్న ఈ నిర్ణయంపై చిత్రోత్సవాల ప్రతినిధుల మధ్య చర్చ జరిగింది. సమాచార, ప్రసార శాఖనే తొలుత ఈ చిత్రాలను ఎంపిక చేసిందని, తర్వాత వాటిని నిషేధించిందని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని వారు ఎద్దేవా చేశారు. ఇక దర్శకుడు ఇంగ్రిడ్ శాంటోస్ దర్శకత్వం వహించిన స్పానిష్ చిత్రమైన బీఫ్‌లో ప్రధానంగా వలసలు, గుర్తింపు, విచారం, తల్లీ కూతుళ్ళ మధ్య ఘర్షణ, హిప్–హాప్ సంస్కృతి, మహిళా సాధికారత వంటి అంశాలను చూపించారు. కానీ సినిమా పేరు 'బీఫ్' అయిన కారణంతోనే ఈ సినిమా ప్రదర్శనకు అనుమతిని నిరాకరించారని ప్రతినిధులు విమర్శించారు. ఆఫ్రికన్ డ్రామా అవార్డును గెలుచుకున్న చిత్రమైన టింబుక్టులో మాలి, ఆఫ్రికాల్లోని జిహాదీ గ్రూపులను తీవ్రంగా విమర్శించారు. జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్న దర్శకుడు అబ్దురహమాన్ సిసాకొ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో డ్రస్ కోడ్‌లపై విధించిన ఆంక్షలతో సహా రోజువారీ జీవితంలో ఎదుర్కొంటున్న నిషేధాజ్ఞలను సుదీర్ఘంగా వివరించారు.

## బీజేపీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ప్రయత్నం



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయం ముట్టడి కార్యక్రమంకు పిలుపునిచ్చింది.నేషనల్ హెరాల్డ్ కేసులో గత పదేళ్లుగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ను బీజేపీ ప్రభుత్వం వేదిస్తున్నధీ అని కోర్ట్ సోనియా గాంధీ,రాహుల్ గాంధీ లపై ఈడి కేసులను తప్పుబట్టిన నేపథ్యంలో నిలదీస్తూ ఏఐసిసి మరియు పిసిసి ఆదేశాల మేరకు నాయకులు,కార్యకర్తలుకాంగ్రెస్ భవన్ నుండి ర్యాలీగా బయలుదేరి బీజేపీ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టారు.మధ్యలో పోలీస్ లు అడ్డుకొని స్టేషన్ కి తరలించారు.నేషనల్ హెరాల్డ్ ఒక న్యూస్ పేపర్. దీనిని జవహర్ లాల్ నెహ్రూ 1938లో ప్రారంభించారు. కొంతమంది ఫ్రీడమ్ ఫైటర్లు కలిసి 1937లో స్థాపించిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ఈ పత్రికను పబ్లిష్ చేసింది. ఆ గ్రూపులో సుమారు ఐదు వేలమంది ఫ్రీడమ్ ఫైటర్లు షేర్ హోల్డర్లుగా ఉండేవారు. అనతికాలంలోనే నేషనల్ హెరాల్డ్ పేపర్ ఒక జాతీయవాద పత్రికగా పేరు పొందింది. అయితే ఆర్థిక కారణాలతో 2008లో ఈ న్యూస్ పేపర్ సేవలు నిలిచిపోయాయి. పేపర్ ప్రచురణను కూడా నిలిపివేశారు. కానీ 2016 నుంచి డిజిటల్ పబ్లికేషన్ ప్రారంభమైంది. సెప్టెంబర్ 2010 నాటికి ఎజెఎల్ కి 1,057 మంది వాటాదారులు ఉన్నారు.నేషనల్ హెరాల్డ్ పత్రిక సంస్థను కొనుగోలు చేయడానికి పార్టీ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఉన్నాయి. వారిపై బీజేపీ నేత సుబ్రమణియన్ స్వామి 2012లో ఫిర్యాదు చేశారు. 2016 నుంచి ఈడీ వారిని ప్రశ్నిస్తోంది. ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, నిధుల దుర్వినియోగం చేయలేదని సుప్రీం కోర్టు కేసు రద్దు చేయడం ద్వారా స్పష్టం అయిందని రామకృష్ణ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ కాబోయే ప్రధాని అని అతన్ని ఎవ్వరు అడ్డుకోలేరని ఆయన జోశ్యం చెప్పారు.ఈ ధర్నాలో నాయకులూ, కార్యకర్తలు పాల్గొన్నారు

## వేములవాడ అర్బన్ మండల సర్పంచుల ఫోరం
# కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**- అధ్యక్షులుగా తిరుపతి యాదవ్ - ఇటిక్యాల రాజు**

**- రెండున్నరేళ్ల చొప్పున పదవీకాలం స్వీకరణ**

**- సర్పంచుల సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తా - ఏ.టి.యాదవ్**





వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ అర్బన్ మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో,విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో జరిగిన సర్పంచుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.అర్బన్ మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో పాటు, సర్పంచుల సమస్యలను ప్రభుత్వ స్థాయికి తీసుకెళ్లేందుకు ఫోరం సమిష్టిగా పనిచేయాలని సమావేశంలో తీర్మానించారు.అధ్యక్ష పదవిని చెరో రెండున్నర ఏళ్ల చొప్పున పంచుకోవాలని నిర్ణయించడంతో, మొదటి పదవీకాలానికి శాభాష్‌పల్లి సర్పంచ్ అన్నబోయిన తిరుపతి యాదవ్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు. అనంతరం ఆరేపల్లి గ్రామ సర్పంచ్ ఇటిక్యాల రాజు రెండో పదవీకాలానికి అధ్యక్షుడిగా కొనసాగనున్నారు.

**- ఫోరం కార్యవర్గంలో**

ఉపాధ్యక్షులుగా అనుపురం సర్పంచ్ శేర్ల రాజేశ్వరి - మల్లేశం,కొడుముంజ సర్పంచ్ కదిరే రాజు,ప్రధాన కార్యదర్శిగా కొలుగూరి మధు - కిరణ్మయి,అధికార ప్రతినిధిగా గుర్రంవానిపల్లి సర్పంచ్ జ్వాల స్వాతి - సురేష్ రెడ్డి,కార్యదర్శిగా మారుపాక సర్పంచ్ దొబ్బల మల్లేశం,ముఖ్య సలహాదారుగా ఇటిక్యాల రాజును ఎంపిక చేశారు.ఈ సందర్భంగా తిరుపతి యాదవ్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే,విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో వేములవాడ అర్బన్ మండలాన్ని అభివృద్ధిలో ముందుండేలా తీర్చిదిద్దుతామని,సర్పంచుల ఐక్యతతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.నూతన కార్యవర్గానికి విప్ ఆది శ్రీనివాస్,పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## నీలోజిపల్లిలో హామీల అమలు దిశగా
# సర్పంచ్ అనుముల భాస్కర్ దృష్టి

**- ప్రమాణ స్వీకారానికి ముందే గ్రామాభివృద్ధి పనులకు శ్రీకారం**

**- గ్రామస్తుల హర్షం - కృతజ్ఞతలు**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,నీలోజిపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ అనుముల భాస్కర్ ప్రమాణ స్వీకారం చేయకముందే అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని పోచమ్మ దేవాలయం సహా అన్ని దేవాలయాలను పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు.ఆలయాల్లో కొనసాగుతున్న, అలాగే నిలిచిపోయిన నిర్మాణ పనుల వివరాలను తెలుసుకొని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలనే ఉద్దేశంతో సర్పంచ్ భాస్కర్ కార్యాచరణను ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మాటలకే పరిమితం చేయకుండా, ముందుగానే అమలు చేయడం పట్ల గ్రామ ప్రజలు సర్పంచ్ భాస్కర్‌ను ప్రశంసిస్తున్నారు.గ్రామ దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని బలోపేతం చేయాలన్న సర్పంచ్ ఆలోచనలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. గ్రామాభివృద్ధి పట్ల సర్పంచ్ చూపుతున్న చొరవను గ్రామ పెద్దలు,యువత,మహిళలు అభినందిస్తూ, ప్రజలతో కలిసి ఇలాగే ముందుకు సాగాలని కోరారు.నూతన సర్పంచ్ నాయకత్వంలో నీలోజిపల్లి గ్రామం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని గ్రామస్థులు విశ్వాసం వ్యక్తం చేశారు.

## చెత్త సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలి

**కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ చెత్త పారవేయకుండా ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. కలెక్టర్ గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఎల్లమ్మగుట్ట రైల్వే కమాన్ సమీపంలో, గాయత్రీనగర్ లో ప్రధాన కూడళ్ళ వద్ద రోడ్ల పక్కన చెత్త పారవేయకుండా చేపట్టిన చర్యలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహనాలలోనే చెత్తను వేయాలని, రోడ్లపై చెత్త పారవేస్తే జరిమానాలు విధించబడతాయనే విషయాన్ని ఫ్లెక్సీలు, బ్యానర్లు, మైకుల ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలలో అవగాహన పెంపొందించాలని అన్నారు. పారిశుధ్య సమస్య నెలకొనకుండా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించేలా చూడాలన్నారు. మురుగు కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేయిస్తూ, ప్రజల ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అవకాశం ఉన్న చోట జె.సీ.బీ యంత్రాల ద్వారా మురుగు కాలువలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా ఖాళీ స్థలాలను శుభ్రం చేయించి, పచ్చదనాన్ని పెంపొందించేలా విరివిగా మొక్కలు నాటించి వాటి పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం కలెక్టర్ నాగారం శివారులోని డంపింగ్ యార్డును సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికీ తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా బయో మైనింగ్ సులభం అవుతుందని అన్నారు. వ్యర్థాలను శుద్ధి చేస్తూ కంపోస్ట్ తయారీ కోసం ప్రతిపాదించిన మరో రెండు వేస్టేజ్ ప్రాసెస్సింగ్ యంత్రాలను సత్వరమే తెప్పించుకుని శుద్ధి ప్రక్రియ ప్రారంభం అయ్యేలా చూడాలని కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డిప్యూటి కమిషనర్ రవిబాబు, ఇంచార్జీ ఎం.హెచ్.ఓ సాజిద్ తదితరులు ఉన్నారు.

## దమ్ముంటే అభివృద్ధి మీద బహిరంగ చర్చకు రావాలి



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) బీజేపీ జిల్లా కార్యాలయం లో జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో నేషనల్ హెరాల్డ్ అనేది రాజకీయ కక్ష సాధింపు కాదని, కాంగ్రెస్ పార్టీ పెద్దల కుటుంబం చేసిన ఆర్థిక అవినీతికి సంబంధించిన చట్టబద్ధమైన కేసు అని స్పష్టం చేశారు. కోట్లాది రూపాయల ప్రజాధనం ఎలా ఒక కుటుంబానికి దారి మళ్లిందో దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందన్నారు.

ఈడి,కోర్టులు విచారిస్తున్న కేసును "ప్రతీకారం" అని కాంగ్రెస్ నేతలు చెప్పడం న్యాయవ్యవస్థను అవమానించడమేనని మండిపడ్డారు. దోషులైతే శిక్ష తప్పదని, ఎంత పెద్ద నేతలైనా చట్టం ముందు సమానమేనని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం విషయంలో ఉపాధి హామీ పథకాన్ని కాగితాలకే పరిమితం చేసిన పార్టీ కాంగ్రెస్ అని, మోదీ ప్రభుత్వం వచ్చాకే ఉపాధి పథకానికి నిధులు, పారదర్శకత, నిజమైన ఉపాధి వచ్చిందన్నారు.కాంగ్రెస్ పాలనలో కూలీల పేర్లతో డబ్బులు కొట్టేసిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయని, నేడు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా డబ్బులు నేరుగా కూలీల ఖాతాల్లో పడుతున్నాయన్నారు. ఇది బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల ఫలితమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఉపాధి పథకం గుర్తొచ్చింది అంటే ప్రజలు ఇక నమ్మడం లేదని, అందుకే దృష్టి మళ్లించేందుకు ముట్టడులు, ఆందోళనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

బీజేపీ పార్టీ అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేస్తుందని, పేదల ఉపాధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎంత అడ్డంకులు సృష్టించినా, ప్రజల కోసం పనిచేయడం ఆపేది లేదని గట్టిగా హెచ్చరించారు జిల్లా బీజేపీ కార్యాలయం ముట్టడి అనేది ఒక డ్రామా అన్నారు దమ్ముంటే అభివృద్ధి మీద బహిరంగ చర్చకు రావాలి అన్నారు. అంతే గాని మా కార్యాలయం దగ్గరికి వచ్చే అర్హత లేదన్నారు మా పార్టీ కార్యకర్తలు నాయకులు తలుచుకుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంట్లో నుంచి బయటకురారు అన్నారు అభివృద్ధి మీద ద్రుష్టి పెట్టాలని చురకలు అంటించారు .

ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మి నారాయణ,న్యాలం రాజు, ప్రమోద్ కుమార్, పద్మ రెడ్డి,అనిల్,శివ ప్రసాద్, ఇప్పకాయల కిషోర్, తారక్ వేణు, కోడూరు నాగరాజ్, ఆనంద్ రావు, పంచారెడ్డి శ్రీధర్, మల్లేష్ గుప్తా, బూరుగుల వినోద్, మురళి కృష్ణ, బైకన్ మధు, నారాయణ యాదవ్, బొబ్బిలి వేణు, బొట్టు వెంకటేష్, అమందు విజయ్ కృష్ణ, చిరంజీవి, సంతోష్, సురేష్, నరేష్ గౌడ్, ఆనంద్, పవన్, లక్ష్మన్, సందీప్, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికలు



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) అందరి సహకారంతో జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లాలో మూడు విడతలలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు సాఫీగా ముగిసిన నేపథ్యంలో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను, ఇతర నోడల్ అధికారులను జిల్లా పంచాయతీ అధికారి డి.శ్రీనివాస్ రావు సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు, సిబ్బంది అందరూ పరస్పర సమన్వయంతో కృషి చేసిన ఫలితంగా ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించుకోగలిగామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలోనూ ఇదే తరహాలో సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అందరికీ జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## యువత సమస్యల కోసం కృషి చేస్తా

**దూడల సూర్య తేజ గౌడ్**



కాప్రా (ప్రశ్న న్యూస్) యువకుల సమస్యలు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని దూడల సూర్యతేజ గౌడ్ అన్నారు. గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా బీఆర్ఎస్వి ప్రెసిడెంట్గా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్, సదాశివ, రామ్ రెడ్డి, సురేష్, నరేందర్, ధనుష్, నల్ల సందీప్, విష్ణు లు ఉన్నారు.

## తూముకుంట పేరు మార్చవద్దు

**తూముకుంట** మేడ్చల్ జిల్లాలోని తూముకుంట జిహెచ్ఎంసి కార్యాలయానికి నూతన నామకరణాన్ని గ్రామస్తులంతా వ్యతిరేకిస్తూ ఏదైతే పాత పేరుతో జిహెచ్ఎంసి కార్యాలయం తమ కార్యకలాపాలను కొనసాగించాలని గ్రామస్తులంతా డిప్యూటీ కమిషనర్ జ్యోతి కీ వినతి పత్రం అందజేశారు. పార్టీలకు అతీతంగా గ్రామస్తులందరు ఈ గ్రామానికి ఇదే నామకరణంతో తమ సేవలను అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి, శ్రీశైలం యాదవ్, దినేష్, ప్రశాంత్ సాయి గౌడ్. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎల్లమ్మ బండలో ఎమ్మెల్యే మాధవరం పర్యటన

రంగారెడ్డి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండాలో 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కూల్చిన ఇండ్లను కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి నియోజకవర్గ బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జ్ మాధవరం కృష్ణారావు సందర్శించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మబండ అనేది ప్రభుత్వ భూమి అని ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి కూడా తెలుసని ఎన్నోసార్లు కూడా ప్రస్తావించారని అన్నారు. కానీ ఓ ఎమ్మెల్యే అయి ఉండి ప్రజలకు న్యాయం చేయాల్సింది పోయి దగ్గరుండి ఇండ్లను కూల్చివేయడం ఏమిటి అని ప్రశ్నించారు. 100 ఫీట్ల రోడ్డుకు తాము వ్యతిరేకం కాదని దానిని ప్రజాభిప్రాయ మద్దతుతో వారికి నష్టపరిహారం అందజేసి పనులు ప్రారంభించాలని అన్నారు. రోడ్డు మధ్యలో సెంటర్ పాయింట్ ని తీసుకొని ఈ పనులు చేయాలని ఇష్టం వచ్చినట్లు చేస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## పోలీస్ కంప్లైంట్'..

# హైడ్ అండ్ సీక్ డ్రామా

హీరోయిన్ వరలక్ష్మి శరత్‌కుమార్, హీరో నవీన్ చంద్ర కీలకపాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పోలీస్ కంప్లైంట్'. 52 మంది సీనియర్ ఆర్టిస్టులు నటిస్తున్న ఈ హారర్ థ్రిల్లర్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుండగా.. డైరెక్టర్ సంజీవ్ మేగోటి తెరకెక్కించారు. ఎమ్మెస్కె ప్రమిదశ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై సంజీవ్ మేగోటి రచన-దర్శకత్వంలో బాలకృష్ణ మహారాణా నిర్మించిన యాక్షన్ థ్రిల్లర్ తెలుగు, కన్నడ టీజర్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డైరెక్టర్..'ప్రేమ, పగ, తప్పు-ఒప్పు, మంచి-చెడు మధ్య హైడ్ అండ్ సీక్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో కన్నడ స్టార్ హీరోయిన్ రాగిణి ద్వివేది ప్రత్యేక పాత్రలో ప్రేక్షకులకు థ్రిల్ కలిగిస్తారు. ఉత్కంఠభరితమైన స్క్రీన్‌ప్లేతో సాగే ఈ చిత్రంలో కృష్ణసాయి, బేబీ తనస్వి భిన్న పాత్రల్లో మెప్పిస్తారు. వరలక్ష్మి శరత్ కుమార్ ఈ సినిమాలో భయంతో పాటు ఎంటర్టైన్మెంట్ అందిస్తారు. 45 రోజుల్లోనే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేయడానికి వరలక్ష్మి కారణం. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం.. నాలుగు భాషల్లో సినిమాను రూపొందిస్తున్నాం' అని తెలిపారు.

# నేను ఏఐ బాధితురాలినే.. చట్టపరమైన చర్యలు తీసుకుంటాను



ఏఐ టెక్నాలజీ వల్ల ఎన్నో మార్పులు ఏర్పడుతూ జనాలను ఆశ్చర్యానికి గురయ్యేలా చేస్తున్నాయి. అదే స్థాయిలో దుర్వినియోగానికి కూడా గురవుతోంది. ఏఐ కారణంగా ఎంతోమంది టాలీవుడ్ హీరోయిన్స్ ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే శ్రీలీల, రష్మిక, కాజల్, కీర్తి సురేష్ వంటి వారు ఏఐ బారిన పడి తమ బోల్డ్ ఫొటోలను వైరల్ చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా, మరో హీరోయిన్ నివేదా థామస్ ఏఐ బారిన పడినట్లు తెలుపుతూ దుర్వినియోగానికి పాల్పడే వారికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఏఐతో అసభ్యకరంగా ఫొటోలను మార్ఫింగ్ చేసి సర్క్యులేట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ''ఏఐతో నా ఫొటోలను ఎడిట్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. నా అనుమతి లేకుండా అలాంటి కంటెంట్ సృష్టించడం, సర్క్యులేట్ చేయడం నన్ను తీవ్రంగా కలిచివేసింది. ఇది నా వ్యక్తిగత గోప్యతపై జరిగిన దాడి. వెంటనే నా ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియా ఖాతాల నుంచి తొలగించండి. ఎవరైనా ఇలాంటి కంటెంట్‌ను గుర్తిస్తే.. వాటిని ఎవరికీ కూడా షేర్ చేయవద్దు. అనసరమైన వాటిని షేర్ చేసి ఇబ్బందుల్లో పడొద్దు. ఉద్దేశపూర్వకంగా దుర్వినియోగానికి పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాను'' అని ఎమోషనల్ నోట్ షేర్ చేసింది. టాలీవుడ్ ఇండస్ట్రీలో వరుసగా.. స్టార్ హీరోయిన్లనే కొందరు టార్గెట్ చేస్తుండటం గమనార్హం. కేవలం సెలబ్రిటీలే కాదు.. సాధారణ మహిళలు కూడా ఏఐ దుర్వినియోగం వల్ల ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. మంచి కోసం ఉపయోగించాలి తప్ప ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికి కాదనే చర్చ సోషల్ మీడియాలో ఊపందుకుంది.

## అలా జరుగుతుందని

# అనుకోలేదు

?



కన్నడ యంగ్ బ్యూటీ రుక్మిణి వసంత్ 'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయం అయింది. ఈ మూవీ అమ్మడుకి ఊహించని పాపులారిటీని తెచ్చిపెట్టింది. ఇందులోని నటనకు ప్రశంసలు కూడా దక్కాయి. ఇక ఈ సినిమాతో రుక్మిణి వసంత్ రేంజ్ మారిపోయింది. తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తూ తన ఫేమ్ పెంచుకుంటుంది. ఇటీవల 'మదరాసి'తో ప్రేక్షకులను అలరించిన ఈ భామ 'కాంతార: చాప్టర్1' మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం తెలుగులో యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన ఓ భారీ ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దీంతో పాటు రుక్మిణి వసంత్ కోలీవుడ్, బాలీవుడ్ ఇండస్ట్రీల్లోనూ అవకాశాలు దక్కించుకుంటూ క్రేజీ హీరోయిన్‌గా రాణిస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రుక్మిణి ఆసక్తికర విషయాన్ని వెల్లడించింది. తాను రిషబ్ శెట్టి 'కాంతార:చాప్టర్1' విలన్‌గా నటించడంపై తన అనుభవాన్ని పంచుకుంది. కాంతారలో నేను విలన్ పాత్రలో నటించడం నా కెరీర్ ప్రారంభంలో చేసిన ఒక ప్రమాదకరమైన ప్రయోగం అని చెప్పాలి. ఎందుకంటే నేను నటించిన విలన్ పాత్రను ప్రజలు ఇష్టపడ్డారు కాబట్టి సరిపోయింది. లేకుంటే నన్ను ద్వేషించే వారు. ట్రోల్స్ చేసేవారు.. నా కెరీర్‌పై ప్రభావం చూపించేది.

## 2026లో డబుల్ ట్రీట్

# ఉంటుంది



టాలీవుడ్ యంగ్ హీరోల్లో ఒకరైన అడివి శేష్ బుధవారం తన బర్త్ డే సందర్భంగా నెటిజన్లతో చిట్ చాట్ చేశారు. ఎక్స్ లో అభిమానులు తనను అడిగిన ప్రశ్నలకు సూటిగా సుత్తిలేకుండా సమాధానాలిచ్చారు. డెకాయిట్, హిట్ 4 సినిమాల గురించే నెటిజన్లు ఆయన్ను ఎక్కువగా ప్రశ్నలడిగారు. ఓ నెటిజన్ డెకాయిట్ షూటింగ్ ఏది కష్టంగా అనిపించిందని అడగ్గా.. ఒకేరోజు మదనపల్లె యాసలో, మరోవైపు హిందీలో డైలాగ్స్ చెప్పడం కష్టంగా అనిపించిందని బదులిచ్చారు. అంటే ఈ సినిమాలో అడివి శేష్ మదనపల్లె బ్యాగ్రౌండ్ ఉన్న వ్యక్తిగా కనిపించనున్నారంటూ నెటిజన్లలో కకొత్త అంచనాలు మొదలయ్యాయి. అలాగే మృణాల్ యాక్టింగ్ ఈ మూవీలో ఎలా ఉంటుందని మరొకరు అడగ్గా.. సినిమాలో ఆమె చాలా కీలకమని తెలిపారు. ఇక హిట్ 3 క్లైమాక్స్ లో కనిపించినట్లే.. హిట్ 4లో కూడా కనిపిస్తారా అని మరొక నెటిజన్ అడగ్గా.. ఈ ప్రశ్న డైరెక్టర్ శైలేష్ ను అడగాలని సూచించారు. ఏదైనా వెబ్ సిరీస్ లో నటించే ఆలోచన ఉందా అని అభిమాని ప్రశ్నించగా.. తాను కేవలం థియేట్రికల్ సినిమాలు మాత్రమే చేస్తానని స్పష్టం చేశారు. తమిళ భాష అర్థమవుతుందా అని ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు శేష్ చెప్పిన సమాధానం తెలిస్తే కాస్త నవ్వుకుంటారు. రాజా రాణి వంటి సినిమాల్లో తమిళం అర్థమవుతుంది కానీ.. పొన్నియిన్ సెల్వన్ లాంటి సినిమాల్లో అది చాలా కష్టమని, తమిళనం నేర్చుకోవడం అంటే తనకు చాలా ఇష్టమని తెలిపారు. 2026లో +2, డెకాయిట్ సినిమాల రిలీజులతో డబుల్ ట్రీట్ ఉంటుందని ఎక్స్పెక్ట్ చేయొచ్చా అని అడిగిన నెటిజన్ కు.. 100 శాతం ఉంటుందని శేష్ చెప్పారు. ఇండస్ట్రీలోకి వచ్చే నెక్స్ట్ జనరేషన్ కు ఏం సజెషన్ ఇస్తారని మరొకరు అడగ్గా.. రాసేటపుడు, యాక్ట్ చేసేటపుడు, సినిమా తీసేటపుడు మొబైల్స్ ఆఫ్ చేసుకోవాలని చెప్తానన్నారు.

# ఓటీటీలో 'సంతాన ప్రాప్తిరస్తు'




విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. ఈ మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ మూవీ ఈ నెల 19వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియో, జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ కు రాబోతోంది. గత నెల 14న థియేట్రికల్ రిలీజ్ వచ్చిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో బాక్సాఫీస్ సక్సెస్ అందుకుంది. వినోదంతో పాటు ఒక మంచి సందేశాన్ని అందించిన సినిమాగా "సంతాన ప్రాప్తిరస్తు" అందరి ప్రశంసలు దక్కించుకుంది. ఇప్పుడు ప్రైమ్ వీడియో, హాట్ స్టార్ ద్వారా మరింతగా ఆడియెన్స్ కు ఈ సినిమా రీచ్ కానుంది. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి రూపొందించారు. కల్యాణ్ రాఘవ్ డైలాగ్స్, అజయ్ అరసాడ మ్యూజిక్ ఈ సినిమాకు ఆకర్షణగా నిలిచాయి. వెన్నెల కిషోర్, తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్, హర్షవర్ధన్ ఇతర కీ రోల్స్ లో ఆకట్టుకున్నారు.

## గొప్ప మనసు చాటుకున్న

# నాగార్జున



కింగ్ నాగార్జున అక్కినేని కృష్ణా జిల్లా గుడివాడలోని ఏఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులు, సిబ్బంది, హాజరైన వారందరికీ ఒక చిరస్మరణీయ క్షణాన్ని అందించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ,.. తన తల్లిదండ్రులైన అక్కినేని నాగేశ్వరరావు, అన్నపూర్ణ అక్కినేని జ్ఞాపకార్థం అక్కినేని కుటుంబం ఏఎన్ఆర్ కళాశాలలో 2 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్ నిధిని ఏర్పాటు చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. ఈ నిర్ణయం తాను, తన సోదరి సుశీల, సోదరుడు వెంకట్, మొత్తం ఏఎన్ఆర్ కుటుంబం కలిసి తీసుకున్నట్లు తెలిపారు."ఈ నిధిని సరైన పద్ధతిలో అమలు చేయడానికి మేము ఏఎన్ఆర్ కళాశాల యాజమాన్యంతో కలిసి పని చేస్తాము. సంవత్సరాల క్రితం మా నాన్నగారు ఈ సంస్థకు లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు, ఆయన వారసత్వాన్ని కొనసాగించడం మా బాధ్యత. ఈ ప్రకటనకు విద్యార్థులు, అధ్యాపకుల నుంచి కరతాళ ధ్వనులు లభించాయి. ఇది కేవలం కుటుంబం యొక్క ఉదారతను మాత్రమే కాకుండా, విద్య, సమాజ సేవతో వారికి ఉన్న శాశ్వత అనుబంధాన్ని కూడా చాటింది.

## రేషన్ కార్డుదారులందరికీ e-KYC తప్పనిసరి

**జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) జిల్లాలోని రేషన్ కార్డుదారులందరికీ జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA) కింద అర్హులైన లబ్ధిదారులందరికీ e-KYC ప్రక్రియ తప్పనిసరిగా అమలు చేయబడుతుందని జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ కార్డుదారులు తమ e-KYC పూర్తి చేయకపోతే e-POS యంత్రం ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయడం సాధ్యం కాదని అన్నారు. అయినప్పటికీ జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో 205 కొంతమంది లబ్ధిదారులు e-KYC పూర్తి చేయకపోవడంగమనించబడింది. జిల్లాలోని అన్ని రేషన్ కార్డుదారులు వెంటనే తమ సమీపంలోని రేషన్ షాప్కు వెళ్లి e-KYC ప్రక్రియను పూర్తి చేయవలసిందిగాసూచించడమైనది. అని తెలిపారు అలాగే జిల్లాలోని రేషన్ షాప్ డీలర్లు మీ యొక్క రేషన్ షాప్ ను తెరిచి ఉంచి తమ పరిధిలోని రేషన్ కార్డుదారులందరి e-KYCను 100 శాతం పూర్తిచేయించి, వారికి పూర్తి అవగాహన కల్పించవలసిందిగా ఆదేశించడమైనది. e-KYC పూర్తయిన రేషన్ కార్డులకు మాత్రమే రేషన్ సరుకులు పంపిణీ చేయబడతాయి. కావున e-KYC పూర్తి చేయని రేషన్ కార్డులకు రేషన్ సరుకుల పంపిణీ నిలిపివేయబడుతుంది అని స్పష్టం చేశారు.. e-KYC పూర్తి చేయడంలో లబ్ధిదారులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత రేషన్ షాప్లో సహాయం అందించబడుతుందని తెలిపారు.

## జగిత్యాల జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డా ఆకుల శ్రీనివాస్

**-వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించి**

**జగిత్యాల జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలి**



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా నూతన వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిగా డా ఆకుల శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు జిల్లా వైద్యాధికారిగా పనిచేసిన డా కె ప్రమోద్ కుమార్ డిప్యూటేషన్ పై పెద్దపెల్లి జిల్లాకు వెళ్ళారు. వైద్య సిబ్బంది నూతన డిఎంహెచ్వో గా బాధ్యతలు స్వీకరించిన డా ఏ శ్రీనివాసుకు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చాన్నీ అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డా ఏ శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించి జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్, ఏ ఏం ఓ సత్యనారాయణ, ఎన్ హెచ్ ఎం ,డి పి ఓ రవీందర్, హెచ్ ఈ ఓ లు రామ్ కుమార్ ,శ్రీధర్, రాజేశం, హెల్త్ ఎడ్యుకేటర్స్ కటకం భూమేశ్వర్, తరాల శంకర్, సూపర్వైజర్లు శ్రీనివాస్, శ్యామ్, మురళి ,తదితరులు పాల్గొన్నారు.

## అగ్రహారం జోడాంజనేయ స్వామి ఆలయంలో భక్తులకు మౌళిక సౌకర్యాల కొరత

**- మరుగుదొడ్లకు తాళాలు - నీరు, సౌకర్యాలు లేవు**

**- ఇబ్బందులు పడుతున్న భక్తులు**




వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం శ్రీ జోడాంజనేయ స్వామి ఆలయానికి నిత్యం అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వస్తుంటారు. అయితే భక్తులకు అవసరమైన మౌళిక సౌకర్యాల కల్పనలో ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో భక్తుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు, స్నానాల గదులకు తాళాలు వేసి ఉండటంతో పాటు, కొంతకాలంగా నల్లాల్లో నీరు రాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని భక్తులు వాపోతున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు దర్శనానికి వచ్చినప్పుడు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ అంశంపై ప్రజాప్రశ్న ప్రతినిధి ఆలయ ఈఓ ను వివరణ



కోరగా, సమస్యను త్వరలోనే పరిష్కరించి అవసరమైన చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. మరి ఆలయ అధికారులు ఎంత త్వరగా స్పందించి భక్తులకు మౌళిక సౌకర్యాలు కల్పిస్తారో వేచి చూడాల్సిందే..!

## రైకనపాట భూమయ్య కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలో ఇటీవల మరణించిన రైకనపాట భూమయ్య కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా భూమయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మాజీ కౌన్సిలర్ నరాల శేఖర్, నీలం శేఖర్, కూరగాయల శేఖర్, మల్లేశం తదితరులు కూడా భూమయ్య నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. భూమయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, ఈ కష్ట సమయంలో కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు.

# గణపురం ఆనకట్టకు సాగునీటి విడుదలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలి.

**యాసంగి సాగుపై మెదక్ జిల్లా రైతాంగం తీవ్ర అయోమయంలో ఉంది.**

**వేసవిలో చేయాల్సిన సింగూరు మరమ్మతులు ఇప్పుడు చేయడం ప్రభుత్వ అసమర్థత కు నిదర్శనం.**

**మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి**





మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, హరీష్ రావు నిర్వహించిన మీడియా సమావేశం. మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల మెదక్ జిల్లా రైతాంగం నేడు అగమ్యగోచర స్థితిలో ఉంది. యాసంగి పంట సాగు చేయాలా వద్దా అన్న సందిగ్ధంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ముఖ్యంగా సింగూరు ప్రాజెక్టు నుండి గణపురం ఆనకట్టకు సాగునీరు విడుదల చేస్తారా లేదా అన్న అంశంపై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడం దారుణం. పాపన్నపేట, హవేలీఘన్పూర్, కొల్చారం, మెదక్ రూరల్ మండలాల్లోని వేలాది ఎకరాలు గణపురం కట్టపైనే ఆధారపడి వ్యవసాయం సాగు చేస్తారు. సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల పేరుతో ప్రభుత్వం నీటిని ఖాళీ చేసింది. నిజానికి ఈ పనులు వేసవి కాలంలోనే పూర్తి చేసి ఉంటే ఇప్పుడు యాసంగికి ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం ప్రాజెక్టులో 17 టీఎంసీల నీరు ఉంది, పంటను కాపాడుతూనే మరమ్మతులు చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వానికి ఆ చిత్తశుద్ధి లేదు. నాట్లు వేసే సమయం ఆసన్నమైనా అధికారులు, పాలకులు స్పందించకపోవడంతో రైతులు గత్యంతరం లేక మళ్ళీ బోర్లు వేస్తూ అప్పుల పాలవుతున్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో బోరు బండి మాయమైతే, రేవంత్ రెడ్డి పాలన వచ్చిందంటే మళ్ళీ పాత రోజులు వచ్చాయి. సింగూరు నీటిపై మెదక్, నిజామాబాద్ రైతుల హక్కును కాపాడాలి. తక్షణమే నీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయాలి, లేని పక్షంలో క్రాఫ్ హాలిడే ప్రకటించి ఎకరాకు తగిన నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి. గత పది సంవత్సరాల్లో రెండు పంటలకు నీళ్లు ఇచ్చి హైదరాబాద్ కు రైతులు రాకుండా చూసింది బిఆర్ఎస్ ప్రభుత్వం. అవసరమైతే కాళేశ్వరం నీళ్లను మళ్లించి పంటలను కాపాడాం. కానీ ఈ ప్రభుత్వం రైతులను అయోమయానికి గురి చేస్తూ మొద్దు నిద్ర పోతోంది. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ, రైతుబంధు, బోనస్ విషయంలో రైతులను దారుణంగా మోసం చేసింది. ఏడుపాయల సాక్షిగా ప్రమాణం చేసి రుణమాఫీ చేస్తానన్న ముఖ్యమంత్రి, నేటికీ కేవలం 40 శాతం మందికి మాత్రమే పూర్తి చేశారు. గత యాసంగి ఈ వానాకాలం కలిపి రైతులకు రావాల్సిన సుమారు 1800 కోట్ల రూపాయల బోనస్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. యాసంగి సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి సాయం ఊసే లేదు. సాగు చేసిన వారికే ఇస్తామంటూ సాకులు వెతుకుతూ పత్తి, చెరుకు, పసుపు సాగు చేసే రైతులకు ఎగనామం పెట్టాలని చూస్తున్నారు. ఎటువంటి కోతలు లేకుండా రైతుబంధు నిధులను తక్షణమే విడుదల చేయాలి. పోయిన వానాకాలంలో యూరియా, జనుము, జీలుగు విత్తనాలు దొరకక రైతులు అష్టకష్టాలు పడ్డారు. వ్యవసాయానికి నీళ్లు, కరెంటు, ఎరువులు ఇవ్వడం చేతగాక ఈ ప్రభుత్వం యాప్లు, మ్యాప్ల పేరుతో దొంగ నాటకాలు ఆడుతోంది. అక్షరాస్యత లేని రైతులు, స్మార్ట్ఫోన్లు లేని మహిళా రైతులు అధికారుల చుట్టూ తిరగాలా? నెట్వర్క్ లేని గ్రామాల్లో రైతులు ఈ యాప్లు ఎలా వాడతారు? ఇది కేవలం ఎరువుల సరఫరాను తగ్గించి రైతులను వేధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆడుతున్న నాటకం. పత్తి రైతులకు కపాస్ యాప్ తెచ్చి బీజేపీ ముంచితే, ఎరువుల కోసం యాప్ తెచ్చి కాంగ్రెస్ ముంచుతోంది. కౌలు రైతుల భవిష్యత్తును కూడా ఈ ప్రభుత్వం ప్రశ్నార్థకం చేసింది. తక్షణమే ఈ యాప్ నాటకాలు బంద్ చేసి, గతంలో మాదిరిగా ఫెర్టిలైజర్ షాపుల ద్వారా యూరియా అందించాలి. కేసీఆర్ హయాంలో యూరియా, కరెంటు, రైతుబంధు, పంట కొనుగోలుకు ఎన్నడూ ఇబ్బంది లేదు. ఇప్పుడు అన్ని ఇబ్బందులే, ఎక్కడా 14 గంటల కరెంటు కూడా రావడం లేదు. రైతులకు, కౌలు రైతులకు మధ్య పంచాయతీలు పెడుతూ అడుగడుగునా రైతులను కష్టాల పాలు చేస్తున్నారు. పంట కొనుగోలు విషయంలోనూ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. తక్షణమే రుణమాఫీ పూర్తి చేయాలి, బోనస్ బకాయిలు చెల్లించాలి, రైతుబంధు విడుదల చేయాలి మరియు గణపురం ఆనకట్ట నీటిపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.

## శ్రీ ఏడుపాయల వన దుర్గ భవాని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన

**కిష్టాపూర్ గ్రామం నూతన సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామ నూతన సర్పంచ్ సాదుల స్వప్న ఉషయ్య ఎన్నికైన సందర్భంగా గురువారం నాడు శ్రీ ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారి సన్నిధిలో ఆలయ అర్చకులు పార్థివ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా కిష్టాపురం గ్రామపంచాయతీ నూతన సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికలలో కిష్టాపూర్ గ్రామ సర్పంచిగా గెలిపించినందుకు కిష్టాపూర్ గ్రామ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు మరియు నాపై నమ్మకం ఉండి నూతన సర్పంచ్ గా గెలిపించినందుకు నా బాధ్యతతో నాకు కర్తవ్యంతో గ్రామ ప్రజల సహకారంతో అందర్నీ కలుపుకుంటూ కిష్టాపురం గ్రామానికి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని గ్రామ సర్పంచ్ సాదుల సప్న ఊశయ్య తెలిపారు

**- నర్సాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ ను కలిసిన నూతన సర్పంచ్**

నూతనంగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో నర్సాపూర్ నియోజకవర్గ కొల్చారం మండల్ కిష్టాపూర్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సాదుల స్వప్న ఊశయ్య సర్పంచ్ గా గెలుపొందారు మరియు ఉప సర్పంచ్ గా చందాపురం నిర్మల శేఖర్ విజయం సాధించారు మరియు ఐదు వార్డు మెంబర్లు గెలవడం జరిగింది గెలుపొందిన వారికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరా రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానం చేయడం జరిగింది..ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ కౌన్సిలర్ సంఘసాని సురేష్ , మాజీ కౌన్సిలర్ గోడ రాజేందర్ , జిల్లా కార్యదర్శి ఆంజనేయులుగౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎంచర్ల శేఖర్ యాదవ్, రాంపూర్ మాజీ ఎంపీటీసీ యాదగిరి, బూత్ అధ్యక్షులు వడ్ల చంద్రశేఖర్, ఎంబరి శేఖర్ యాదవ్, కాశమ్మ సాయిరాజ్, అకేం ప్రవీణ్ యాదవ్, నాగుల గారి దుర్గా గౌడ్, సాదుల దుర్గ ప్రసాద్, సాదుల కిరణ్,యాదగిరి , శ్రీకాంత్ , సత్తులు యాదవ్ , రాములు యాదవ్ మరియు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో న్యాయవాదులు ప్రజాసేవకు ఆదర్శంగా నిలవాలి

**- వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు : గుడిసె సదానందం**

**- సర్పంచ్, వార్డు సభ్యులుగా గెలిచిన న్యాయవాదులకు ఘన సన్మానం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా గెలుపొందిన న్యాయవాదులు ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తూ తమ పదవులకు వన్నె తెచ్చేలా వ్యవహరించాలని వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం పిలుపునిచ్చారు. వేములవాడ కోర్టు బార్ అసోసియేషన్ హాలులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో, బార్లో ప్రాక్టీస్ చేస్తూ దుంద్రపల్లి గ్రామ సర్పంచ్గా ఎన్నికైన జంగం అంజయ్యతో పాటు, వివిధ గ్రామాల వార్డు సభ్యులుగా గెలుపొందిన మారుమొఖం అనిల్ కుమార్ (మల్లారం),కన్నం అనిల్ (అనంతపల్లి), తోట శేఖర్ (నాగయ్యపల్లి)లను శాలువాలతో సత్కరించి, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా గుడిసె సదానందం మాట్లాడుతూ న్యాయవాదులు రాజకీయాల్లోకి రావడం ప్రజాసేవకు మరింత బలం చేకూరుస్తుందని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ న్యాయ విలువలు, ప్రజాస్వామ్య సూత్రాలను పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కోర్ట్ ఏజీపీ బొడ్డు ప్రశాంత్ కుమార్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, కటకం జనార్ధన్, పొత్తూరు అనిల్ కుమార్, విద్యాసాగర్ రావు, కోళ్ల శ్రీనివాస్, పర్లపల్లి అంజయ్య, పెంటరాజు, జక్కుల పద్మ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఘన సన్మానం

**- బీసీ సాధికారత సంఘం నేతలు**

**- కొండ దేవయ్య,పొలాస నరేందర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న రాజన్న సిరిసిల్ల జిల్లాలో నూతనంగా పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికైన సర్పంచులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు వేములవాడలోని బీసీ సాధికారిత సంఘం కార్యాలయంలో ఈ ఆత్మీయ సన్మానం జరగనుందని, ఈ కార్యక్రమానికి జిల్లా పరిధిలో నూతనంగా ఎన్నికైన సర్పంచులందరూ హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర బీసీ సాధికారిత సంఘం గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్, ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జీ పొలాస నరేందర్ కోరారు.

# అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిన ముషీరాబాద్ సర్కిల్

**- యదేచ్ఛగా రహదారులపై అక్రమ నిర్మాణాలు - ముషీరాబాద్‌లో జిహెచ్ఎంసి నిబంధనలకు తూట్లు**

**- సెల్లార్ నుంచి అనుమతిలేని అంతస్తుల వరకూ అధికారుల "మౌన ఆశీర్వాదం"**



ముషీరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అభివృద్ధి పేరుతో నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కానీ ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న కొన్ని నిర్మాణాలు మాత్రం అభివృద్ధికి భిన్నంగా అక్రమాలకు నిలువెత్తు రూపంగా మారుతున్నాయి. ప్రధాన రహదారులకే ఆనుకొని అక్రమ సెల్లార్‌లు, అనుమతిలేని అంతస్తులు నిర్మించబడుతున్నా, వాటిని అడ్డుకోవాల్సిన జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు లంచాలు తీసుకొని మౌనం పాటిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### కాగితాలకే పరిమితమైన నియమాలు - అమలు ఎక్కడ ?

జిహెచ్ఎంసి నిర్మాణ నిబంధనల ప్రకారం రహదారులపై సెల్లార్ నిర్మాణానికి స్పష్టమైన ఆంక్షలు ఉన్నాయి. రోడ్ల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజల సౌకర్యం దృష్ట్యా ఈ నియమాలు రూపొందించబడ్డాయి. అయినప్పటికీ ముషీరాబాద్ పరిధిలో ఈ నిబంధనలు కాగితాలకే పరిమితమై, క్షేత్రస్థాయిలో పూర్తిగా విస్మరించబడుతున్నాయి.

### అధికారుల కళ్లముందే అక్రమాలు..

అక్రమ నిర్మాణాలు ఒక్కసారిగా వెలిసేవి కావు. ప్లాన్ అప్రూవల్ నుంచి ఫౌండేషన్, సెల్లార్ తవ్వకం, అంతస్తుల నిర్మాణం వరకు ప్రతీ దశలో టౌన్ ప్లానింగ్ అధికారుల తనిఖీలు తప్పనిసరి. అయిన అక్రమ నిర్మాణాలు నిర్భంధం లేకుండా కొనసాగుతున్నాయంటే, అధికారుల పూర్తి నిర్లక్ష్యం లేదా ప్రత్యక్ష సహకారమే కారణమన్న విమర్శలు



వినిపిస్తున్నాయి. అయిన అధికారులు వాటిని లెక్క చేయకుండా అక్రమ నిర్మాణాలకు సహకారం ఇస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

### లంచాల వ్యవస్థ బలపడుతోందా.?

స్థానికుల ఆరోపణల ప్రకారం, ముషీరాబాద్ సర్కిల్‌లో కొందరు అధికారులు అక్రమ నిర్మాణాలపై నోటీసులు ఇవ్వకుండా వదిలేయడం, ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోకపోవడం, పత్రికల్లో కథనాలు వచ్చిన పట్టించుకోకపోవడం వంటి వ్యవహారాలకు పాల్పడుతున్నారు. ఇది లంచాల వ్యవస్థ బలపడుతోందన్న అనుమానాలకు బలం చేకూరుస్తోంది. టౌన్ ప్లానింగ్ అధికారులు దర్జాగా లంచాలు తీసుకొని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు అన్న విషయం ఉన్నత అధికారులకు తెలిసిన మౌనంగా ఉండడం వెనక వాళ్లకు కూడా వాటాలు అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు కోట్లలలో అక్రమ ఆస్తులు సంపాదించారనడంలో అతిశయోక్తి లేదు. ముషీరాబాద్ సర్కిల్ కు సంబంధించి రిటైర్మెంట్ కు దగ్గరలో ఉన్న ఓ టౌన్ ప్లానింగ్ అధికారి దాదాపు 300 కోట్ల వరకు అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారని అతని సంపాదించిన అక్రమాస్తులను బొంబాయి హైవేలో భూములు కొనుగోలు చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

### ప్రమాదాల బాటలో ప్రజలు..



అక్రమ సెల్లార్‌లు, అధిక అంతస్తులు,భవనాల నిర్మాణ స్థిరత్వంపై ప్రభావం పడి



రహదారులు కుంగిపోయే ప్రమాదం ఉందని, వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు వంటి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. అయిన ప్రజల భద్రత కంటే ప్రభుత్వంలో అక్రమాలకు అనుకూల వాతావరణమే ఎక్కువగా కనిపిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముషీరాబాద్ రహదారిపై పిల్లర్ నంబర్ 22 ముందు పక్కింటి నెంబర్ 1%-9-%379/210/1 జవహర్ నగర్, అశోక్ నగర్ క్రాస్ రోడ్ లో అక్రమ సెల్లార్ అక్రమ అంతస్తులతో ఓ భారీ నిర్మాణం జరుగుతుంటే దీని వెనక అసిస్టెంట్ సిటీ ప్లానర్ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య పూర్తి సహకారం అందించి భారీగా సొమ్ము చేసుకుని సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



### ప్రభుత్వ ఆదేశాలకు తూట్లు..

రాష్ట్ర ప్రభుత్వం అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఆదేశించినా, ముషీరాబాద్ సర్కిల్‌లో మాత్రం ఆ ఆదేశాలు అసలు అమలవుతున్న దాఖలాలు కనబడటం లేదు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, వారిని రక్షించే ధోరణి అవలంబిస్తున్నారన్న ఆరోపణలు ప్రభుత్వ ప్రతిష్ఠకే సవాల్‌గా మారుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయాన్ని పూర్తిగా కొల్లగొడుతున్నారు.

### సమగ్ర విచారణకు డిమాండ్..

ముషీరాబాద్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్, ఏసీబీ అధికారులు సమగ్ర సర్వేను నిర్వహించి బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకొని అక్రమ సెల్లార్‌లు, అంతస్తులను కూల్చివేయాలని పలువురు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### నిబంధనలు కాగితాలకేనా? చర్యలు ఉంటాయా.?

అక్రమ నిర్మాణాలపై ఇప్పటికైనా చర్యలు ఉంటాయా.?లేదా.?నిబంధనలు కాగితాలకే పరిమితమై, ప్రజల భద్రత ప్రమాదంలోనే కొనసాగుతుందా.? ముఖ్యమంత్రి కార్యాలయము, జిహెచ్ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్ స్పందించకుంటే ఇక ప్రభుత్వ నియమనిబంధనలు ఎందుకని మున్సిపల్ చట్టాన్ని పూర్తిగా తొలగించి ఎవరు ఎలా నిర్మించుకున్న పట్టించుకోకుంటే సరిపోతుంది కదా ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొన్నదని పేరుకే మున్సిపల్ చట్టం అధికారులే దానిని లెక్క చేయనప్పుడు ఇక ఎవరికోసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# అక్రమ కట్టడాలపై మున్సిపల్ కమిషనర్ ఉక్కు పాదం

**- నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా**

**- అక్రమ కట్టడాలపై మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా కన్నెర్ర**

**- నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని తుమ్మూరులో ఇటీవల నిర్మించిన ధ్యన టవర్స్ లో పార్కింగ్ స్థలాన్ని కమర్షియల్ గా మార్చే క్రమంలో కూల్చివేత**

**- ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా హెచ్చరికలు జారీ చేశారు.**

నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్) అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. నాయుడుపేట మున్సిపాలిటీ కమిషనర్ కొరడా ఝుళిపిస్తుండటంతో హడెలెత్తిపోతున్నారు. ఇన్నాళ్లు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగిన అక్రమ దందాపై అధికారులు ఉక్కపాదం మోపడంతో యథేచ్ఛగా సాగిస్తున్న దందాకు కళ్లెం పడింది.అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా



ఉపేక్షించేది లేదనిఅక్రమ కట్టడాలపై నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్.ఫజులుల్లా కన్నెర్ర చేశారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని తుమ్మూరులో ఇటీవల నిర్మించిన ధ్యన టవర్స్ లో పార్కింగ్ స్థలాన్ని కమర్షియల్ గా మార్చే క్రమంలో కూల్చివేత చేపట్టారు.ఇటీవల అపార్ట్మెంట్ లో ఉన్న వారు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు.. అక్రమ కట్టడాలు కూల్చివేయడం జరిగిందని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్.ఫజులుల్లా



పేర్కొన్నారు.ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ భవన నిర్మాణాలు చేపట్టే ముందు, స్థలాలు కొనే ముందు వాటికి అనుమతులు ఉన్నాయా లేవా? ఆ భవనాలు టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారా లేదా చూసుకొని కొనుగోలు చేసుకో వాలని మునిసిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాసూచించారు.

నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని భరత్‌నగర్‌లో ఉన్న యష్ ధన్య అపార్ట్‌మెంట్‌లో స్టిల్ట్ ఫ్లోర్‌లో అనధికారంగా చేపట్టిన నిర్మాణంపై ఫ్లాట్ యజమానులు పిజిఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేశారని . ఆ ఫిర్యాదును మున్సిపల్ అధికారుల ద్వారా విచారణ చేయగా, స్టిల్ట్ ప్రాంతంలో చేపట్టిన నిర్మాణం పూర్తిగా అనధికారమని నిర్ధారణ అయిందని అందువల్ల, సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం మున్సిపల్ అధికారులచే చట్టబద్ధమైన



కూల్చివేత చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.ఇదే సందర్భంలో, నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో అనుమతించిన ప్లాన్‌కు విరుద్ధంగా లేదా అనధికార అంతస్తులతో నిర్మించబడిన అన్ని భవన యజమానులు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిపిఎస్ కింద తమ భవనాల ప్లాన్‌లను సమర్పించి, చట్టబద్ధం చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు ఎప్పుడూ లేనంతగా భవన నియమాలను సడలింపులు ఇచ్చి అవకాశం కల్పించిందని . ఈ అవకాశాన్ని వినియోగించుకోని పక్షంలో, అనుమతించిన ప్లాన్‌కు



విరుద్ధంగా లేదా పూర్తిగా అనధికారంగా నిర్మించిన భవనాలు/అంతస్తులు ఏపీ మున్సిపాలిటీ యాక్ట్ ఏపీ 1965 ప్రకారం తప్పనిసరిగా కూల్చివేయబడతాయని ఆయన తెలియజేశారు.ఇకపై, మున్సిపాలిటీ పరిధిలో నోటీసులు జారీ చేసిన భవనాలలో ఉన్న అనధికార డివియేషన్ అంతస్తులపై తక్షణ కూల్చివేత చర్యలు చేపట్టబడతాయని కమిషనర్ తెలియజేశారు.

# 20 ఏళ్ల నిరీక్షణకు తెర

**-సుప్రీం కోర్టులో తెలంగాణకు భారీ ఊరట**

**- రూ.15వేల కోట్ల విలువ చేసే భూములు తెలంగాణకు చెందినవే**





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానంలో ఊహించని రీతిలో భారీ ఊరట లభించింది. హైదరాబాద్ నగర శివార్లలో అత్యంత ఖరీదైన దాదాపు రూ. 15,000 కోట్ల విలువ చేసే భూములపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. వనస్థలిపురం సమీపంలోని సాహెబ్‌నగర్ వద్ద ఉన్న 102 ఎకరాల వివాదాస్పద భూమి పూర్తిగా తెలంగాణ అటవీశాఖకు చెందుతుందని న్యాయస్థానం స్పష్టం చేసింది.

### - రెండు దశాబ్దాల న్యాయ పోరాటం..

ఈ భూమిపై యాజమాన్య హక్కుల కోసం గత 20 ఏళ్లుగా సుదీర్ఘ పోరాటం కొనసాగుతోంది. నిజాం నవాబులు, సాలార్ జంగ్, మీరాలం వారసులమని చెప్పుకుంటూ సుమారు 260 మంది ఈ భూమి తమదేనంటూ న్యాయస్థానాలను ఆశ్రయించారు. గతంలో ఈ వివాదంపై విచారణ జరిపిన రాష్ట్ర హైకోర్టు పిటిషన్ వేసిన వ్యక్తులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం పట్టువదలకుండా ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టిలతో కూడిన ధర్మాసనం ఈ కేసును నిశితంగా పరిశీలించింది. అటవీ రికార్డులు, చారిత్రక ఆధారాలను విశ్లేషించిన అనంతరం సదరు 102 ఎకరాల భూమి ప్రైవేటు వ్యక్తులది కాదని అది పూర్తిగా రిజర్వ్ ఫారెస్ట్ అని తేల్చి చెప్పింది. హైకోర్టు ఇచ్చిన పాత తీర్పును కొట్టివేస్తూ ప్రభుత్వానికి పూర్తి హక్కులు కల్పించింది. తీర్పు ఇచ్చిన ఎనిమిది వారాల వ్యవధిలో ఈ 102 ఎకరాల భూమిని అధికారికంగా రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించింది. నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆ పత్రాలను కోర్టు రిజిస్ట్రీకి సమర్పించాలని సూచించింది. దీనివల్ల భవిష్యత్తులో ఈ భూమిపై ఎటువంటి ప్రైవేటు ఆక్రమణలకు అవకాశం ఉండదు. హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తున్న క్రమంలో వనస్థలిపురం, సాహెబ్‌నగర్ వంటి ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇలాంటి సమయంలో 102 ఎకరాల పచ్చటి అటవీ ప్రాంతం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడటం పర్యావరణ పరంగా పెద్ద విజయంగా భావించవచ్చు. ఈ అటవీ భూమి అభివృద్ధి చెందితే నగర వాసులకు ఆక్సిజన్ అందించే 'అర్బన్ లంగ్స్' గా మారుతుంది. ఈ తీర్పుతో రియల్ ఎస్టేట్ మాఫియా, నకిలీ వారసులమని చెప్పుకునే వారి ఆటలు సాగవని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో ధైర్యంగా పోరాడితే విజయం లభిస్తుందని ఈ తీర్పు నిరూపించింది. ఈ అటవీ ప్రాంతాన్ని మరింత పటిష్టంగా కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని.. పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

# నా గుండెల్లో ఉండేది కేసీఆరే, నా చేతిలో ఉండేది గులాబీ జెండానే

**- సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు కౌంటర్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) 'నాకు,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మధ్య మిత్ర బేధం సృష్టించాలని తద్వారా బీఆర్ఎస్‌ను బలహీన పరచాలని సీఎం రేవంత్ రెడ్డి ఒక చీప్ ట్రిక్ ప్లే చేస్తున్నాడు' అని మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపించారు.కేటీఆర్ వెనకాల తాను గోతులు తవ్వుతున్నానంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.'పంచాయతీ ఎన్నికల ఫలితాలు చూసిన రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్ పీక్స్‌కు చేరింది. రోజురోజుకీ పరిస్థితులు చేజారి పోతున్నాయనే సత్యం జీర్ణం కాక అవాకులు చెవాకులు పేలుతూ అక్కసు వెళ్లగక్కుతున్నాడు' అని హరీశ్ రావు మండిపడ్డారు. త్వరలోనే తనకు పతనం తప్పదనే సంగతి అర్థమై ఆగమాగం అవుతున్నడు.త్వరలోనే తన కుర్చీ ఊడుతుందని, తన దోపిడీ ఆగిపోతుందనే భయంతో రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్‌లో అడ్డగోలుగా వాగాడు అంటూ మాజీమంత్రి హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### - హరీశ్ రావు గుండెల్లో ఉండేది కేసీఆరే

కేటీఆర్, తనకు మధ్య విభేధాలు సృష్టించాలని తద్వారా బీఆర్ఎస్ పార్టీని బలహీన పరిచేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.'సీఎం రేవంత్ రెడ్డి నీ చీప్ ట్రిక్కులకు, చిల్లర రాజకీయాలకు ఎవడు పడిపోడు. నీ కుట్రలు, కుత్సితాలు ఫలించవు గాక ఫలించవు అని హరీశ్ రావు చెప్పుకొచ్చారు. అనేక సార్లు చెప్పినా మళ్లీ మళ్లీ చెబుతున్నా రాసి పెట్టుకో రేవంత్ రెడ్డి. ఎప్పటికైనా హరీశ్ రావు గుండెల్లో ఉండేది కేసీఆరే. హరీశ్ రావు చేతిలో ఉండేది గులాబీ జెండానే' అని మాజీమంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. 'నీ దాష్టీకాలు, దుర్మార్గలకు వ్యతిరేకంగా నేనూ, కేటీఆర్ మరింత సమన్వయంగా, మరింత సమర్థవంతంగా రెట్టించిన ఉత్సాహంతో పోరాడుతం.నీ అవినీతిని ఎండగడుతం. అసమర్థతను నిలదీస్తం'అని మాజీమంత్రి హరీశ్ రావు హెచ్చరించారు.

### - కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయం

'ఉద్యమ కాలం నుంచి నేటి దాకా తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్న నిన్ను, నీ కాంగ్రెస్‌ను గద్దె దించుతం.నా లక్ష్యమైనా, కేటీఆర్ లక్ష్యమైనా, లక్షలాది గులాబీ సైనికుల లక్ష్యమైనా ఇదే'అని మాజీమంత్రి హరీశ్ రావు చెప్పుకొచ్చారు.'రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ విజయపథంలో పురోగమించడం ఖాయం.మరోసారి కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి కావడం ఖాయం. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సంపూర్ణంగా నెరవేర్చడం ఖాయం'అని మాజీమంత్రి హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

### - నీ చిల్లర వేషాలను ప్రజలు ఛీ కొడుతున్నారు

'నీ చిల్లర వేషాలు, చెత్త రాజకీయాలను చూసి ప్రజలు ఛీ కొడుతున్నరు, బుద్ధి తెచ్చుకో.మిగిలిన కొద్ది కాలమైనా సరిగ్గా వినియోగించుకో'అని మాజీమంత్రి హరీశ్ రావు సూచించారు.'కమీషన్లు, రియల్ ఎస్టేట్ దందాలే కాదు ప్రజలకు అక్కరకు వచ్చే పనులు చేయి. లేకుంటే ఉద్యమ ద్రోహి గానే కాదూ, చేవలేని, చేతగాని ముఖ్యమంత్రిగా కూడా చరిత్రలో నిలిచిపోతవు'అని మాజీమంత్రి హరీశ్ రావు హెచ్చరించారు.

### - కేటీఆర్,హరీశ్ రావులపై సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు ఇవే

కేటీఆర్ కాంగ్రెస్ గురించి కాకుండా హరీశ్ రావు గురించి ఆలోచిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు తన వెనకాల గోతులు తవ్వుతున్నారని కేటీఆర్ ఆలోచిస్తున్నారని చెప్పుకొచ్చారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక అన్ని ఎన్నికల్లోనూ ఆ పార్టీ ఓడిపోయిందని గుర్తు చేశారు. కేటీఆర్‌ను తప్పించాలని హరీశ్ రావు వర్గం ఇప్పటికే ప్రచారం చేస్తోందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ నాయకత్వాన్ని మార్చాలని హరీశ్ రావు ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. హరీశ్ రావు ప్రయత్నాన్ని తిప్పి కొట్టేందుకే కేటీఆర్ పర్యటనలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588